: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com

శ్రీకాకుళం

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

5-10-2026
సోమవారం
సంపుటి: 32
సంచిక: 246
పేజీలు: 16
వెల: 6.50

రైతుల సంక్షేమం కోసం
అదనపు నిధులివ్వండి

ఆదివారం బుర్రిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్, సిఎం చంద్రబాబు

● ఖరీఫ్ పంటల కొనుగోలుకు సహకరించండి ● కిసాన్ డ్రోన్ల పెండింగ్ నిధుల విడుదల చేయండి ● కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సిఎం లేఖ ● ఎపికి మరో 6 లక్షల ఇళ్లు మంజూరు చేయాలి ● ఈ విషయంలో చొరవ తీసుకోవాలని చౌహాన్‌కు విజ్ఞప్తి

అమరావతి, అక్టోబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో రైతులకు మేలు చేకూర్చేలా, అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసి లబ్ధి కలిగించేలా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు రాసిన రెండు వేర్వేరు లేఖల్లో కోరారు. రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబా >>2

ఆదివారం బుర్రిపాలెంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి 3డి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సిఎం చంద్రబాబు తదితరులు

9 లక్షల ఇళ్లతో పేదలకు పట్టాభిషేకం

2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు

● 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి బుర్రిపాలెం నుంచి శ్రీకారం ● మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ ● 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టుగా 177 ఇళ్ల నిర్మాణం ● కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఇళ్ల నిర్మాణానికి సిఎం చంద్రబాబు శంకుస్థాపన ● పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ముఖ్యమంత్రి సంకల్పం గొప్పదని చౌహాన్ వ్యాఖ్య

తెనాలి, అక్టోబరు 4 ప్రభాతవార్త: 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ వంద శాతం పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పేదలకు సొంతిల్లు ఉంటే వారి జీవన ప్రమాణాలతో పాటు ఆత్మగౌరవం పెరుగుతుందని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబంతో కలిసి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చంద్రబాబు తెలిపారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లను, వచ్చే యేడాది మరో 3 లక్షల ఇళ్లను మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అంగీకరించారని చెప్పారు. మొత్తంగా 9లక్షలఇళ్లను రాష్ట్రానికి మంజూరు చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. పేదలకు సొంత ఇల్లు >>2

జీడిపప్పులో నాణ్యత లేదు

● టిటిడి తిరస్కరణ ● జిసిసి తిలోదకాలు ● టెస్టింగ్‌తో వెలుగులోకి ● 12 టన్నులు వెనక్కి

తిరుమల / పార్వతీపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలేశుని క్షణకాలం దర్శనం తరువాత అంతటి పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి అవసరమైన నాణ్యత జీడిపప్పు సరఫరా టెండర్లకు జిసిసి తిలోదకాలిచ్చేసింది. ఏకంగా తిరుమలకు పార్వతీపురం నుండి సుమారు 12 టన్నుల జీడిపప్పును ఇటీవల సరఫరా చేసింది. భారీగా చేరిన జీడిపప్పు నాణ్యతను టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ల విభాగం ఫుడ్ అనాలిసిస్ అధునాతన పరిశోధనశాలలో క్షుణ్ణంగా పరీక్షించింది. పప్పునాణ్యతా ప్రమాణాల పరీక్షల్లో నాణ్యత లేకపోవడంతో టిటిడి అధికారులు గత వారమే వెనక్కి పంపించేశారు. భారీ మొత్తంలో తొలిసారే జిసిసి సరఫరా చేసిన జీడిపప్పు నాణ్యతలేదని తేలడంతో ఆ శాఖ అంతర్మథనంలో పడింది. టిటిడి వర్గాలు, అధికారులు నాణ్యతలో ఏ మాత్రం రాజీలేని ధోరణితో వ్యవహరించడమే లోపం వెలుగుచూసిందనేది టిటిడి వర్గాలు చెబుతున్నాయి. టిటిడి అధికారులు తీసుకున్న సంచలన నిర్ణయంతో శ్రీవారి ప్రసాదాల తయారీలో నాణ్యతకే ఆమోదం ఉందనేది మరోసారి స్పష్టమైంది. పార్వతీపురం నుండి టిటిడికి అవసరమైన మేరకు జీడిపప్పు 12టన్నులు సరఫరా చేయాలని ఒప్పందంతో గత కొన్నిరోజుల క్రిందట తిరుమల గోడౌన్‌కు చేరుకుంది. జీడిపప్పునాణ్యతను పరీక్షించిన అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని నిర్ధారించారు. తిరుమల లడ్డూ ప్రసాదంతోబాటు శ్రీవారికి అన్నప్రసాదాలు తయారీలో కూడా జీడిపప్పు వినియోగిస్తారు. టిటిడికి మూడునెలల కాలానికి అవసరమైన 1.20 లక్షల కిలోల జీడిపప్పు సరఫరా కోసం సెప్టెంబరు 3న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్ ప్రక్రియలో చెన్నైకి చెందిన క్రిస్టీ క్వాలిటీ ఫుడ్స్, ఫంక్షనల్ ఇన్నోవేటివ్ ఫుడ్స్‌తోబాటు పలుసంస్థలు పాల్గొన్నాయి. నిబంధనల ప్రకారం టెండర్‌లో పాల్గొనే సంస్థకు కనీసం 75 వేల కేజీల జీడిపప్పు సరఫరా చేసిన >>2

'సర్'పై విచారణ

ముంబైలో 'విరాట్ గర్జన'

ఒకే వేదికపై థాకరే బ్రదర్స్

ఇండియా కూటమి నేతలు హాజరు 2లో

12న అల్పపీడనం

మూడు రోజులు వర్షాలు 2లో

వాతావరణ శాఖ అధికారుల వెల్లడి

ఇంటింటికి కొళాయి

ప్రతి కుటుంబానికి మంచినీటి భరోసా

నేడు ప్రొద్దుటూరులో శ్రీకారం 3లో

జ్ఞానేష్‌కు చిక్కులు 2లో

20యేళ్ల విజిలెన్స్ విచారణ మళ్లీ రీఓపెన్ చేసిన కేరళ సర్కార్

05-10pg2exHMNWJQEG.qxd:05-10pg2exHMNWJQEG.qxd 1/1/02 6:31 AM Page 1

భూమి పూజ చేసిన అనంతరం లబ్ధిదారు కుటుంబానికి నూతన వస్త్రాలను బహూకరిస్తున్న దృశ్యం

పేదలకు పట్టాభిషేకం

>> ఇవ్వాలన్న ఆలోచనకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని సిఎం గుర్తు చేశారు. 3 లక్షల ఇళ్ల నిర్మాణం అంటే కేవలం ఇళ్ల నిర్మించడమే కాదని, 3 లక్షల కుటుంబాల జీవితాల్లో మార్పునకు శ్రీకారం చుట్టే కార్యక్రమమని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు వేసిన ఓటుతో సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ చేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించేం దుకు బుర్రిపాలెంలో రూ.14 కోట్లతో 3డి కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా 177 ఇళ్ల నిర్మాణానికి చేపట్టిన పైలట్ ప్రాజెక్టును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సిఎం సందర్శించారు.
కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు గురించి అధికారులు వివరించారు. 3డి ప్రింటింగ్ సాంకేతికతతో తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో పటిష్టమైన ఇళ్లను నిర్మించవచ్చని అధికారులు వివరించారు. ఈ సాంకేతికతతో నిర్మించే ఇళ్లలో బయట వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు సిఎం అన్నారు.

పేదలకు రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలు:

పేదలకు పట్టాభిషేకంలో భాగంగా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి పేదలకు నివాస స్థలాలు అందించామని ముఖ్య మంత్రి చంద్రబాబు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి సహా వివిధ ప్రాంతాల్లో రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలను పేదలకు అందించామని చెప్పారు. ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ అజెండా అని స్పష్టం చేశారు. గత పాలనలో గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని సిఎం విమర్శించారు. 2019-24 మధ్య 6 లక్షల పేదల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని చెరువులు, గుట్టల్లో ఇంటిస్థలాలు ఇచ్చారని ఆరోపించారు. దాదాపు 4 లక్షల మంది ఆ స్థలాలను వద్దంటూ వెనక్కి ఇచ్చేశారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ పేదలకు పక్కాఇళ్లను నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి పోలవరం పూర్తయ్యేలోగా గోదావరి నీటిని వినియోగించుకున్నామని సిఎం చెప్పారు. ఎల్‌నినో వంటి తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లోనూ కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని తరలించి పంటలను కాపాడగలిగామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటి సమస్య లేకుండా చేస్తామనిఅన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అంకురార్పణ చేశామని, రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన ఫలాల ఉత్పత్తి కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామనితెలిపారు. వచ్చే ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభి వృద్ధి పనులు చేపడతామని చెప్పారు.

షైనింగ్ ఆంధ్రా అచీవింగ్ ఆంధ్రా : శివరాజ్ సింగ్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ విజనరీ నేత చంద్రబాబు నేతృత్వంలో ఎపి ఇక షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రాగా మారుతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పబలం గొప్పదని ప్రశంసించారు. 3డి కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ఎపిలో చేపడుతున్న గృహనిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేపట్టిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లకు శాంక్షన్ ఇస్తామని, ఆ తర్వాత మరో 3 లక్షల ఇళ్లను కూడా ఎపికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానిమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎపి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రైతుల కోసం కేంద్రంతో కలిసి ఎపి సిఎం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల ఆర్థిక సహకారం అందిస్తున్నారని అన్నారు. ఎపిలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు మొత్తం 'సుఖీభవ' అనే విధానంలో ఎపిలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. విబిజి రామ్ జి పథకంతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్లు సహా వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. ఎపిని 360 డిగ్రీల కోణంలో సిఎం చంద్రబాబు, ప్రధాని మోడీ అభివృద్ధి చేస్తున్నారన్నారు.

త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ పరిశీలన:

అంతకుముందు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సిఎం చంద్రబాబు త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టును సందర్శించారు. సిబిఆర్ఐ అధికారులు వారికి త్రీడి టెక్నాలజీ నిర్మాణ ప్రక్రియ గురించి వివరించారు. కేవలం 10 రోజుల్లో ఒక ఇంటిని ఈ సాంకేతికతతో నిర్మించే అవకాశముందని తెలిపారు. అనంతరం ఇరువురు నేతలూ ఓ లబ్ధిదారు కుటుంబానికి చెందిన ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమి పూజ చేసిన అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ఆప్యాయంగా మాట్లాడి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సూచికగా శిలాఫలకం ఆవిష్కరించి అక్కడికి సమీపంలోనే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వేదికపై లక్ష్మీ అనే మహిళకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇంటి పట్టాన అందించారు.

విమానాన్ని కూల్చేయాలనుకున్నా!

ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

టెల్అవీవ్, అక్టోబరు 4: ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్ హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యుఎఇలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

స్పెయిన్‌లో గృహ సంక్షోభం

అద్దెల భారంపై మాడ్రిడ్‌లో భారీ నిరసన

మాడ్రిడ్, అక్టోబరు 4: స్పెయిన్‌లో గృహ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. ఇళ్ల కొరత, విపరీతంగా పెరిగిన అద్దెలు, బలవంతపు ఖాళీలపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. రాజధాని మాడ్రిడ్‌తో పాటు దేశంలోని 50 నగరాల్లో శనివారం పదివేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతిపా దించిన అత్యవసర గృహనిర్మాణ చర్యలను పార్లమెంట్ తిరస్కరించిన మరుసటి రోజే ఈ ఆందోళనలు జరగడం గమనార్హం. మాడ్రిడ్‌లో జరిగిన ప్రదర్శనలో సుమారు 70,000 మంది పాల్గొన్నారని అధికారులు అంచనా వేయగా, ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. అద్దెలు తగ్గించా లని, ఇళ్లు ఖాళీ చేయించకుండా బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లు నివాస గృహాలను కొనుగోలు చేయడంపై ఆంక్షలు విధించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కొందరు దేశవ్యాప్త సమ్మెకు కూడా పిలుపునిచ్చారు. గత నెలలో జరిగిన ఒక సంఘటన ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోసింది. దశాబ్దాలుగా ఒకే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న 87యేళ్ల మారికార్మెన్ అబాస్కల్‌ను ఇంటి నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ భవనాన్ని కొనుగోలు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అద్దెను భారీగా పెంచడంతో ఆమె చెల్లించలేకపోయారు. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం స్పెయిన్‌లో దాదాపు 7 లక్షల ఇళ్ల కొరత ఉన్నట్లు అంచనా. 2025లో సగటున అద్దెలు 8.5శాతం పెరగ్గా, మాడ్రిడ్, బార్సిలోనా వంటి నగరాల్లో ఈ పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంది. దీంతోపాటు ఇళ్ల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ప్రధాని పెడ్రో సాంచెజ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రెండు కీలక డిక్రీలను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బలహీన వర్గాల వారిని 2030 వరకు ఇళ్ల నుంచి ఖాళీ చేయించకుండా నిలిపివేయడం, కొన్ని అద్దె ఒప్పందాలను పొడిగించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయి. అయితే, ప్రతిపక్షాలైన పాపులర్ పార్టీ, వోక్స్, జంట్స్ పార్టీలు వ్యతిరేకించడంతో ఈ ప్రతిపాదనలు వీగిపోయాయి. ఈ రాజకీయ పరిణామాలతో స్పెయిన్‌లో ముందస్తు ఎన్నికలు రావొచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి.

12న అల్పపీడనం

అమరావతి ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో బలమైన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. కోస్తాంధ్ర, యానాం పరిధిలో సోమ, మంగళవారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవొచ్చు. తీర ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ జల్లులు పడే సూచనలు కూడా కనిపిస్తున్నాయి.ఆదివారం నేడు అనకాపల్లి, కాకినాడ, కోనసీమ మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.రాయలసీమలోనూ ఆదివారం అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం నాటికి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలులు, వర్షాల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. చేపల వేటకు వెళ్లే వారు, సముద్ర తీర ప్రాంతాల్లో ఉండే వారు కూడా జాగ్రత్తలు పాటించాలి. రోడ్లపై ప్రయాణించేవారు జాగ్రత్తగా వాహనాలు నడపాలి. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాల ప్రభావం మొదలయ్యే సమయం కావడంతో రాష్ట్రంలో వాతావరణం మారుతూ ఉంటుంది.తమ సూచనలు పాటించి అనవసరమైన ప్రయాణాలు నివారించడం మంచిదని అధికారులు అంటున్నారు.ఇదే సందర్భంలో అక్టోబర్ 12న ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నందున, దాని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అండమాన్ సముద్రంపై అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. ఫలితంగా అక్టోబర్ మాసంలో కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

నాణ్యత లేదు

>> అనుభవం ఉండాలి. అయితే చెన్నైకి చెందిన ఆ రెండు సంస్థలు సమర్పించిన వేబిల్లులను క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేయగా అవి నకిలీవని తేలింది. దీంతో అధికారులు ఆ సంస్థలను టెండర్ల నుండి అనర్హులుగా ప్రకటించారు. సదరు సంస్థలకు చెందిన రూ.56 లక్షల ఇఎండిని అధికారులు తిరిగి ఇచ్చేయడం తప్పుబడుతున్నారు. ఇటీవల జిసిసి నుండి సుమారు 12 టన్నుల జీడిపప్పు టిటిడి గోడౌన్‌కు తీసుకువచ్చారు. తిరుమలలో సరుకులను వినియోగించే ముందు ప్రమాణాలకు అనుగుణంగా ఖచ్చితంగా ఉన్నాయా అని తెలుసుకునేందుకు నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చిన సరుకు నుండి అధికారులు కొన్ని శాంపిల్స్ తీసుకువచ్చి తిరుమలలోని ల్యాబ్‌లో పరీక్షి ంచారు. అవి టిటిడి నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు లేవని గుర్తించారు. దీంతో జీడిపప్పును తిరిగి వెనక్కి పంపించారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చాక నాణ్యత విషయంలో ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. నాణ్యత పరీక్షల్లో ఏ ముడిసరుకులు అయినా బావుంటేనే వాటిని శ్రీవారి ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగిస్తున్నారు. మన్యం జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలో ప్రధాన పంటల్లో జీడి ఒకటి. వ్యాపారులు నాణ్యతలేని జీడిపిక్కలను సరఫరా చేశారు. అధికారులు వీటిని ప్రాసెసింగ్ చేయించి టిటిడికి పంపించారు. అయితే నాణ్యత లేకపోవడంతో వెనక్కు పంపించడం విశేషం.

మావటిపై తిరగబడిన ఏనుగు

తిరుమల,అక్టోబరు 4ప్రభాతవార్తప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంవద్ద ఆదివారం సాయంత్రం ఏనుగు తిరగబడి మావటిపై దాడిచేసింది. అంతేగాక మావటిని క్రిందపడేసి కాలిక్రింద తొక్కిబీభత్సం సృష్టించింది. అక్కడున్న అమ్మవారి ఆలయ సిబ్బంది, భక్తులు భయంతో పరుగులు తీశారు. ఆ మావటికి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే టిటిడి గోశాల సిబ్బంది ఏనుగును కట్టడిచేసి మావటిని హుటాహుటిన తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. తిరుమల తరహాలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కూడా సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి ఊంజలేసేవ నిర్వహిస్తారు. ఆ సమయంలో టిటిడికి సంబంధించిన ఏనుగులు ఆలయం వద్దకు తీసుకురావడం ఆనవాయతీ. ఊంజల్ సేవ పూర్తయిన తరువాత ఆ ఏనుగులను తిరిగి ఉద్యానవనానికి తీసుకెళుతుండగా ఒక ఏనుగు ఒక్కసారిగా మావటిని కింద వేసి తొక్కివేయడంతో అతనికి రక్త వాంతులు అయ్యాయి.
మావటి చంద్రారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. భక్తులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. 108 సహాయంతో గాయపడిన మావటిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ముంబైలో ఆదివారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన విరాట్ గర్జన మోర్చా మహా ర్యాలీ దృశ్యం

'సర్'పై విచారణ

ముంబయి, అక్టోబరు 4: సిఇసిని తక్షణమే తొలగించాలని, సర్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తుజరిపించాలంటూ ఆదివారం ముంబైలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఇద్దరూ కలిసి ఈ భారీ నిరసన ర్యాలీకి నాయకత్వం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. విరాట్ గర్జన మోర్చా పేరిట చేపట్టిన ఈ మహా నిరసన ప్రదర్శనకు విపక్షాల నుంచి భారీ స్పందన లభించింది. సౌత్ ముంబైలోని మెట్రో సినిమా ప్రాంతం నుంచి బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ మోర్చాలో ఏ రాజకీయ పార్టీ జెండాలకూ అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. పాల్గొన్న నాయకులు, వేలాది మంది కార్యకర్తలు కేవలం మువ్వన్నెల జాతీయ పతాకాన్ని మాత్రమే చేతబూని నిరసనల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్‌సీపీ అగ్రనేతలు కూడా ఈ ర్యాలీలో పాల్గొని ఉద్ధవ్, రాజ్‌లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత లోపించిందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ముప్పు వాటిల్లుతోందని ఆరోపిస్తూ దేశ రాజధాని ఢిల్లీలోనూ నిరసనలు మిన్నంటాయి. జంతర్ మంతర్ వైపు మార్చ్ నిర్వహించేందుకు యత్నించిన సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఐసా జాతీయ అధ్యక్షురాలు నేహ బోరాతో పాటు దాదాపు 150 మంది ప్రతిపక్ష, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా గేట్ వద్ద ధర్నా నిర్వహించి ఎన్నికల సంఘం వైఖరిని ఎండగట్టారు.
ఎన్నికల వ్యవస్థపై ప్రజాస్వామ్యవాదుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, ఓటర్ల ముసాయిదా జాబితాలో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేర్పులు చేశారనేది ఆందోళనకారుల ప్రధాన ఆరోపణ. ముంబై, ఢిల్లీలతో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ప్రజాసంఘాలు, పౌర సమాజం వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నాయి.
ఈ క్రమంలోనే ముంబైలోని శివాజీ పార్క్ వద్ద జైల్ భరో కార్యక్రమాలు కూడా జరిగాయి. సీఈసీ తన పదవి నుంచి తప్పుకునే వరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని ప్రతిపక్ష నాయకులు స్పష్టం చేస్తున్నారు.

అదనపు నిధులివ్వండి

>> నికి పక్కా ఇళ్లు కల్పించేలా అదనపు ఇళ్లను మంజూరు చేయాలనే అంశాలను సిఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఖరీఫ్2026కి సంబంధించి 'పిఎంఆశ్రా పథకం కింద కందులు, పెసలు, మినుములు, జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి, కొర్ర, వేరుశనగ వంటి 9 రకాల పంటల అంచనా దిగుబడిని 100 శాతం ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించి, తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి తప్పుతుందని పేర్కొన్నారు. కృష్ణా, కాకినాడ జిల్లాల్లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ ఆధారంగా చేసిన మార్పులను ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో చేర్చాలని, దీనివల్ల 2026-27 రబీ సీజన్ నాటికి ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయవచ్చని ముఖ్యమంత్రి లేఖలో వివరించారు. ఆర్‌కెవివై కిసాన్ డ్రోన్ కార్యక్రమానికి ఆమోదించిన రూ.52.164 కోట్ల పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ నిధులు అందితే రాష్ట్రంలోని 1,130 గ్రామాల్లో యంత్ర పరికరాల బ్యాంకుల ఏర్పాటు ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తవుతుందని సిఎం లేఖలో తెలిపారు. అలాగే 5.69 లక్షల మట్టి నమూనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.10.24 కోట్ల కమిటెడ్ లయబిలిటీ నిధులను, 2026-27 సంవత్సరానికి రావలసిన రూ.61.97 లక్షల మిగులు కేటాయింపులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు.

'హౌసింగ్ ఫర్ ఆల్'కు సహకరించండి:

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికినసిఎం చంద్రబాబునాయుడు కృతజ్ఞతలు తెలుపుతూ మరో లేఖ రాశారు. 3 లక్షల కొత్త ఇళ్లను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. దీంతోపాటు.. మరిన్ని ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని సిఎం చంద్రబాబుకోరారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత గృహ అవసరాలు తీరాలంటే మరో 6 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న గ్రామీణ గృహ అవసరాలను పూర్తిగా తీర్చి, 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి శాశ్వత ఇల్లు అందించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. 6లక్షల ఇళ్లను మంజూరు చేస్తే, ఆ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని సిఎం చంద్రబాబు ఆ లేఖలో హామీఇచ్చారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ అంశాలపై వ్యక్తిగత చొరవ తీసుకుని, నిధుల విడుదల, అవసరమైన అనుమతుల ప్రక్రియ వేగవంతం అయ్యేలా అధికారులను ఆదేశించా లని సిఎం చంద్రబాబు లేఖలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు.

'గృహ నిర్మాణం'లో నూతన శకం

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: గృహ నిర్మాణ రంగంలో ఒక నూతన వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో ఎపిలో అందరికీ ఇళ్లులక్ష్యం దిశగా ఒక కీలక అడుగు పడిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. గ్రామీణ గృహ నిర్మాణంలో దేశంలో తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం ఈ బృహత్తర కార్యక్రమానికి ఉన్న ప్రత్యేకత అని వివరించారు. బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో మొత్తం 177 ఇళ్లను ఈ సాంకేతికతతో నిర్మిస్తారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఒక్కో ఇంటిని కేవలం 10 రోజుల్లోనే పూర్తి చేయొచ్చని వివరించారు. అంతేకాకుండా, నిర్మాణ వ్యర్థాలను తగ్గిస్తూ, నాణ్యత, సమర్థతను ఇది మరింత పెంచుతుందని చెప్పుకొచ్చారు.

వారం - వర్జ్యం

05-10-2026, సోమవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,
తి. దశమి రా.2.08,
న. పుష్యమి రా.11.10,
వ.ఉ.7.53 -ఉ.9.25,
దు.మ.12.19 - మ.1.07,2)మ.2.42 - మ.3.30,
రాహు. ఉ .7.30- ఉ.9.00,
శుభ. స. ఉ.6.00 - ఉ .7.00.

వార్తాఫలం

మేషం : మీ నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. నూతన విషయాలు తెలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

వృషభం : కోపతాపాలకు దూరంగా వుండటం. అన్ని విధాలా మంచిది. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

మిథునం : ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. అనుకోని ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు వుంటాయి.

కర్కాటకం : సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది.

సింహం : నూతన వస్తు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు పొందుతారు.

కన్య : ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు చికాకు కలిగిస్తాయి.

తుల : ఆస్తి, వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

వృశ్చికం : బంధువులను కలిసి ఉత్సాహంగా గడుపుతారు. భాధ్యతలు పెరిగినా సకాలంలో నిర్వహిస్తారు.

ధనుస్సు : దీర్ఘకాలిక రుణాలు కొంత వరకు తీరుస్తారు. ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం పొందుతారు.

మకరం : బాధ్యతలు మరింత పెరుగుతాయి. ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది.మానసిక ప్రశాంతత.

కుంభం : కొత్త వ్యక్తుల పరిచయమై నూతన కార్యక్రమాలు చేపడతారు. సోదరుల నుండి ఆస్తి లాభం పొందుతారు.

మీనం : శ్రమకు తగిన ఫలితం కష్టమే. రాజకీయ పారిశ్రామిక రంగాలలోని వారికి సన్మానాలు అందుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

సంబంధం చూస్తాం, మీరే ఎంపిక చేసుకోండి

పిల్లలను కనండి... జనాభా పెంచండి

సరికొత్త 'డేటింగ్ యాప్'ను తెచ్చిన సింగపూర్ ప్రభుత్వం

పారిస్, అక్టోబరు 4: దేశంలో రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయిన సంతా నోత్పత్తి రేటు (ఫెర్టిలిటీరేట్) సమస్యను అధిగమించేం దుకు సింగపూర్ ప్రభుత్వం సంచలన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. 21 నుంచి 35 సంవత్సరాల వయ సున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం 'ఫస్ట్ డేట్' పేరిట అధికారిక మ్యాచ్‌మేకింగ్ (డేటింగ్) సర్వీస్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ప్రసిద్ధ 'గేల్‌షాప్లీ అల్గారిథమ్' ఆధారంగా ఈప్లాట్‌ఫారమ్ పనిచేయ నుంది. కేవలం సాధారణ డేటింగ్ యాప్‌లలా కాకుండా, ప్రతి దశలో ఒక్కో భాగస్వామితో మాత్రమే డేట్ ఏర్పాటు చేసేలా దీనిని రూపొందించారు. భద్రత, పారదర్శకత కోసం ఉద్యోగులు సింగపూర్ జాతీయ డిజిటల్ ఐడెంటిటీ సిస్టమ్ (సింగ్‌పాస్)ద్వారా లాగిన్ అయ్యేలా వ్యవస్థను అనుసంధానించారు. జనాభా క్షీ ణతను అడ్డుకునేం దుకు ప్రభుత్వం నేరుగా ఉద్యోగులకు సంబంధాలు కుదిర్చే బాధ్యతను తీసుకోవడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నూతనకార్యక్రమంపై పౌరులు, ఉద్యోగుల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత జీవితాల్లోకి ప్రభుత్వ జోక్యం మితిమీరిపోతోందని, ఇది నియంతృత్వ లేదా తీవ్రఆంక్షలతోకూడిన విచిత్రమైన నిర్ణయమని కొందరు విమర్శి స్తున్నారు. మరోవైపు, ఆధునిక జీవనశైలిలో సరైన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడానికి ఇదొక విశ్వసనీయమైన, నిర్మాణా త్మకమైన వేదికగా ఉపయోగపడుతుందని మరికొందరు స్వాగతిస్తున్నారు.

జ్ఞానేష్‌కు చిక్కులు

20యేళ్ల విజిలెన్స్ విచారణ మళ్లీ రీఓపెన్ చేసిన కేరళ సర్కార్

తిరువనంతపురం, అక్టోబరు 4: సిఇసి జ్ఞానేష్ కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2006లో ఆయన కేరళ ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో చోటుచేసుకున్న తీవ్ర అవకతవకలు, నాటి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేరళ హోం మంత్రి రమేశ్ చెన్నిథాల విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్ కింద ఎంసి రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షి ంచిన 'పాటిబెల్ట్' ఇండోమలేషియన్ కన్సార్టియంకు చెందిన ప్రాజెక్ట్ మేనేజర్, మలేషియా సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్ 2006లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ సమయంలో లీ రాసిన ఆత్మహత్య లేఖలో పిడబ్ల్యుడి అధికారుల వేధింపులతో పాటు నాటి కార్యదర్శి జ్ఞానేశ్ కుమార్ పేరును కూడా ప్రస్తావించడం తీవ్ర సంచలనం సృష్టించింది.
అప్పట్లో ఈ ఘటన పై విజిలెన్స్ విచారణ ప్రారంభమైనప్పటికీ, బాహ్య ఒత్తిళ్లు, రాజకీయ జోక్యం కారణంగా ఆ దర్యాప్తు మూలనపడిందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. అసలు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు బయటి శక్తులు ప్రభావం చూపాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో, ఈ కేసులోని అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని హోం మంత్రి రమేశ్ చెన్నిథాల విజిలెన్స్ డైరెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. విజిలెన్స్ విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హోం మంత్రిత్వ శాఖ కార్యాలయం పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘంపై దేశవ్యాప్తంగా రాజకీయ రచ్చ నడుస్తున్న తరుణంలో, రెండు దశాబ్దాల క్రితం నాటి పాత కేసులో సిఇసి జ్ఞానేష్ కుమార్‌పై కేరళ ప్రభుత్వం విచారణకు ఆదేశించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

హంద్రీనీవా సుజల స్రవంతి పనులకు రూ.1000 కోట్లతో టెండర్లు

హామీ నిలబెట్టుకున్న సిఎం

రాజంపేట, అక్టోబరు 4 ప్రభాతవార్త : ఉమ్మడి అనంతపురం ,కడప ,చిత్తూరు జిల్లాల రైతాంగానికి వర ప్రసాదిని అయిన హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశ పనులను కూడా నిర్దిష్ట సమయంలో పూర్తి చేసే దిశగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారు .సీఎం ఆదేశంతో తాజాగా అధికారులు 1000 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రధాన కాలువ పనుల పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచారు. సత్య సాయి జిల్లా అన్నమయ్య జిల్లాల పరిధిలో ప్రధాన కాలువ 463.000 నుంచి 490.300, 000. నుండి 6.185 కిలోమీటర్ల వరకు, 490.000 నుండి 504.345,511 నుండి 554.175 కిలోమీటర్ల వరకు మిగిలిన పనులు, లైనింగ్ ,సీఎం సిడి పనులు చేపట్టేందుకు అన్నమయ్య జిల్లా హంద్రీనీవా సుజల స్రవంతి పనుల పర్యవేక్షక ఇంజనీర్ 511.62 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. అలాగే 400.500 నుండి 463.000 కిలోమీటర్ వరకుపనులు చేప ట్టారు. అలాగే ఈ మార్గంలో సొరంగాలు నిర్మించే 411.850 నుంచి 415. 650,420.850 నుంచి 426.150 కిలోమీటర్ల వరకు పనులు చేపట్టేం దుకు 487.480కోట్ల అంచనా వ్యయంతో అనంతపురం జిల్లా హంద్రీనీవా సుజల స్రవంతి పర్యవేక్షక ఇంజనీర్ టెండర్లు పిలిచారు. టెండర్ల దాఖలు గడువు ఈనెల 16గా నిర్ణయించారు. నెలాఖరులోగా గుత్త దారులు ఖరారు చేసి వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల,అక్టోబరు 4ప్రభాతవార్తప్రతినిధి:పెరటాసి మాసంకావడంతో తిరుమలేశుని దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.భారీగా భక్తులు రావడంతో కొండపై రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఆదివారం ఉదయానికి వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపో యాయి. శ్రీవారి సర్వదర్శనానికి ఉదయం 5గంటలకే శిలాతోరణం వరకు భక్తులు వెలుపల వేచి ఉన్నారు.సాయంత్రంవరకు 52వేలమంది భక్తులు స్వామివారిని దర్శనంచేసుకున్నారు. ప్రతి భక్తునికి 2నుండి 4లడ్డూల వరకు విక్రయిస్తున్నారు.

గ్రామకంతాలుగా గుర్తించి భూసమీకరణ నుంచి మినహాయింపు: సిఎం చంద్రబాబు

అమరావతి,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతిలో గ్రామకంతాలుగా గుర్తించి భూసమీకరణ నుంచి ఇచ్చిన మినహాయింపులను పునః పరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నిబంధనల ప్రకారమే గ్రామ కంతాలను నిర్ధారించారా? మినహాయింపులు సక్రమంగా ఇచ్చారా? అనే అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను సీఆర్డీఏ అథారిటీకి సమర్పించాలని సూచించారు.ఈ అంశంపై పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణతో ఇప్పటికే సమావేశమై కీలకంగా చర్చించారు. రాజధాని పరిధిలోని 29గ్రామాల్లో 2014-19 మధ్య గ్రామకంతం కింద పరిగణించిన భూములను భూసమీకరణ నుంచి మినహాయించారు. రాజధాని ప్రకటన చేసే నాటికి ఉన్న గ్రామకంతాలతో పాటు విస్తరించిన ప్రాంతాలను ఉపగ్రహ చిత్రాలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా గుర్తించారు.

ఇంటింటికి కొళాయి..

ప్రతి కుటుంబానికీ మంచి నీటి భరోసా

శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం

జల్‌జీవన్ మిషన్ 2.0అమరజీవి జలధార పనులను నేడు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్

రూ.30,156కోట్లతో ప్రొద్దుటూరు నుంచి పనులు ప్రారంభం

అమరావతి, అక్టోబర్ 4,ప్రభాతవార్తప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ కూటమి ప్రభుత్వం మరో కీలకమైన ముందడుగేసింది.ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన మంచినీరు అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీ అమలుకు ప్రభుత్వం సంసిద్ధమైంది.ఆదివారం సీఎంవో ఈ అంశంపై కీలక ప్రకటన విడుదల చేసింది. జల్ జీవన్ మిషన్ పనులను రాష్ట్రంలో మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు జల్ జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార్థ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి సోమవారం ప్రొద్దుటూరులో ఈ పనులను ప్రారంభించనున్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఇంటి వద్దే సురక్షితమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం భారీ స్థాయిలో జల్ జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార పనులను చేపడుతోంది.

మరో 27 లక్షల కుటుంబాలకు మంచినీటి సౌకర్యం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 4,933 ఆవాసాల్లో 7.44 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లను అందించింది. అమరజీవి జలధార్థలో భాగంగా మరో 27 లక్షల కుటుంబాలకు మంచి నీటి సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటింటికీ నీటిని అందించాలంటే కేవలం కుళాయి కనెక్షన్లు ఇస్తే సరిపోదని భావించిన ప్రభుత్వం..నీటి వనరులు, శుద్ధి కేంద్రాలు, నిల్వ సామర్థం, పైప్‌లైన్ నెట్‌వర్క్, నిర్వహణ వ్యవస్థను సమగ్రంగా ఉండేలా చర్యలు చేపట్టింది.

గత ప్రభుత్వంలో జేజేఎం పథకం నిర్వీర్యం: గత ప్రభుత్వం అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు ప్రజలకు తాగునీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకాన్నీ నిర్వీర్యం చేసింది. 2019లో ఈ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమయంలో అనేక రాష్ట్రాలు పెద్ద ఎత్తున నిధులు తెచ్చుకున్నాయి. ఉత్తరప్రదేశ్ రూ.1 లక్ష కోట్లు, రాజస్థాన్ రూ.85 వేల కోట్లు, మధ్యప్రదేశ్ రూ.83 వేల కోట్లు, కర్నాటక రూ.63 వేల కోట్లు, అస్సాం రూ.34 వేల కోట్లు జల్ జీవన్ మిషన్ కింద తీసుకున్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.26 వేల కోట్లకు మాత్రమే ప్రతిపాదనలు పంపి 5 ఏళ్ల కాలంలో రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. అది కూడా జలాశయాల నుంచి శాశ్వతంగా నీరందేలా కాకుండా బోర్ల ద్వారా తాత్కాలికంగా వచ్చేలా చేపట్టింది. అయితే నిరంతరాయంగా ప్రజలకు తాగు నీరందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2024లో అధికారంలోకి వచ్చాకకేంద్రంతో మళ్లీ సంప్రదింపులు జరిపి పథకం గడువును 2028 నాటికి పొడిగించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేశారు.జల జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార పనులను ప్రొద్దుటూరునియోజకవర్గం ఎమ్.ఎమ్.పల్లినుంచి ప్రారంభించ నున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు: ఉదయం 09.00 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.20 గంటలకు ప్రొద్దుటూరు మండలం ఎమ్.ఎమ్.పల్లెకు చేరుకుంటారు. 10.35 గంటలకు జల్ జీవన్ మిషన్ పైలాన్ ఆవిష్కరిస్తారు. 10.45 గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్రొద్దుటూరు పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 02.30 గంటలకు అమరావతి చేరుకుంటారు.

ప్రభుత్వంపై అక్కసుతో జగన్ అసత్యప్రచారాలు: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబరు 4: వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ నోరు తెరిస్తే అబద్ధాలు, అభివృద్ధి కార్యక్రమాలు కనిపిస్తే అక్కసు అన్నట్టుగా ఆయన తీరు తయారైందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 2019-24 మధ్య వైసీపీ ఐదేళ్ల పాలనపై ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వానికి రైతు సంక్షేమంపై జగన్ పాఠాలు చెప్పడం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. రాయలసీమకు పెట్టుబడులు రావడం, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించే ప్రయత్నాలు జరగడం కూడా తప్పుగానే కనిపిస్తోందా అని ప్రశ్నించారు. తాడేపల్లిలో కూర్చొని రాజకీయ విమర్శలు చేయడం కంటే, రైతుల కష్టాలు, వారి సమస్యలు, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. రైతుల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని విమర్శించే ముందు, మీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని ఏ పరిస్థితికి తీసుకొచ్చారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని, తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని పబ్ జీ గేమ్ ఆడుకునే జగన్ కు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేసే హక్కు ఎక్కడుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

లక్ష కోట్ల పెట్టుబడులకు, బడ్జెట్ కేటాయింపులకు తేడా తెలియదా?: లక్ష కోట్ల పెట్టుబడులకు, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులకు తేడా తెలియకుండా మాజీ సీఎం జగన్ విమర్శలు చేయడం సరికాదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రైజింగ్ రాయలసీమలో భాగంగా పూర్వోదయ పథకం ద్వారా సుమారు రూ.40 వేల కోట్లు, ప్రైవేటు రంగం నుంచి రూ..60 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

.రైతులను ఆదుకున్న చర్యలపై పంటలవారీగా చర్చకు సిద్ధమా?: ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేందుకు మా ప్రభుత్వం చేపట్టిన మార్కెట్ జోక్య చర్యలను ప్రజల ముందుంచాం. ధరల స్థిరీకరణ నిధి కింద 2025-26లో రూ.300కోట్లు కేటాయించగా, ఇప్పటికే సుమారు రూ.800 కోట్లు మద్దతు ధరల కోసం ఖర్చు చేశాం. ఇందులో పొగాకు రూ.271 కోట్లు, మామిడి రూ.261 కోట్లు, ఉల్లి రూ.125 కోట్లు, కోకో రూ.14 కోట్లు, టమాటాకు రూ.12 కోట్లు ఖర్చు చేశాం. మిర్చికి ఎంఐఎస్ కింద క్వింటాకు రూ.11,781.25 ధరను కేంద్రం నిర్ణయించిందన్నారు.

ఉచిత పంటల బీమా పేరుతో మీ పాలనలో జరిగిందేమిటి?: ఉచిత పంటల బీమాపై మాట్లాడే ముందు వైసీపీ హయాంలో రైతులకు అందిన బీమా పరిహారంపై మాజీ సీఎం జగన్ సమాధానం చెప్పాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రబీ 2018-19 పంట బీమా పరిహారం కూడా 2020 జూన్‌లోనే విడుదలైనట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మా ప్రభుత్వం రైతు భాగస్వామ్యంతో పంటల బీమా అమలు చేస్తోంది. వైసీపీ హయాంలో పరిహారం అందని 81 మంది రైతు కుటుంబాలకు 5.67 కోట్ల పరిహారం చెల్లించామని, 2025-26లో రూ.22 కోట్ల బడ్జెట్ కేటాయించామని తెలిపారు.

ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యం: మాజీ సిఎం జగన్

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయనవన్నీ పిట్టలదొర మాటలేనని "ఎక్స్"వేదికగా ధ్వజ మెత్తారు. రాయలసీమలో హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కోసం ఏకంగా రూ.లక్ష కోట్లు కేటాయిస్తామంటూ చంద్రబాబు చేసిన ప్రకటనపై ఫైర్ అయ్యారు. ఇవన్నీ కేవలం పిట్టలదొర మాటలని, బడ్జెట్‌లో కనీస కేటాయింపులు లేకుండా క్షేత్రస్థాయిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా రైతులను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న ప్రేమ కేవలం మాటలకు, ప్రచారాలకు మాత్రమే పరిమితమైనందని విమర్శించారు. పంటలకు ధరలు లేక రైతులు రోడ్డునపడితే, రోజూ ధర్నాలు చేస్తే ఏ రోజైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.ధరల స్థిరీకరణ నిధిని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఉచిత పంటల బీమా పథకాన్ని సైతం ఎత్తివేసి అన్నదాతలను నిలువునా ముంచిందని జగన్ మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటల కోసం రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారని ఒక్కో ట్యాంకర్‌కు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదని జగన్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఇంతటి విపత్కర పరిస్థితులుంటే సీఎం చంద్రబాబు నాయుడు తనకు తాను వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇచ్చు కోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ముక్త్యాల-మచిలీపట్నం జలమార్గం అభివృద్ధి

విజయవాడ.అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:ఏపీలో ప్రజా భాగస్వామ్యంతో జల రవాణాపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.కీలకంగా కృష్ణానదిలో జల రవాణాకు ఉన్న అవకాశాలను మెరుగుపరుస్తుంది.ఈ క్రమంలోనే ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల నుంచి మచిలీపట్నం వరకు భారీ జలమార్గాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది.పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో సుమారు రూ.1,700 కోట్ల వ్యయంతో ఈ జలరవాణా ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర జలరవాణా అథారిటీ సమర్పించిన ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ని పరిశీలించిన జాతీయ జలరవాణా అథారిటీ ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా కొన్ని మార్పులు సూచించి, షరతులతో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) జారీ చేసింది.ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే బందరు కాలువలో ఏడాది పొడవునా నిరంతరం జలాలు అందుబాటులో ఉండాలి. దీనికోసం అధికారులు లోతైన అధ్యయనం చేశారు. వేసవి (మే నెల) కాలంలోనూ ప్రకాశం బ్యారేజి ఆధారంగా ముక్త్యాల వరకు ఎక్కడ,ఎంత లోతులో నీటి లభ్యత ఉంటుందో లెక్కించారు. ముక్త్యాల నుంచి ప్రకాశం బ్యారేజి వరకు కృష్ణానదిలో 0.7 మీటర్ల నుంచి 4.5 మీటర్ల వరకు నీటి లోతు ఉన్నట్లు తేల్చారు.బందరు కాలువలోనూ 1.5 మీటర్ల నుంచి 3.5 మీటర్ల లోతును ప్రాతిపదికగా తీసుకుని రవాణాకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర జలవనరుల శాఖ నుంచి ఇప్పటికే అధికారిక అనుమతి లభించినట్లు ఏపీ జలరవాణా అథారిటీ చైర్మన్ శివ ప్రసాద్ వెల్లడించారు. ముక్త్యాల- మచిలీపట్నం మధ్య జలమార్గం అభివృద్ధికి పీపీపీ పద్ధతిలో నవంబరు నెలాఖరుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేలా అడుగులు వేస్తున్నామన్నారు.

అందుబాటులోకి పర్యాటక బోటు

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:విజయవాడ కృష్ణా నదిలో పర్యాటకులకు మరో కొత్త ఆకర్షణ త్వరలో అందుబాటులోకి రానుంది. నదిపై విహారంతో పాటు పడవలేనే హోటల్ సౌకర్యాలు, భోజనం, వినోదం, పార్టీలు, ప్రత్యేక వేడుకలు ఒకే వేదికపై నిర్వహించుకునేలా లగ్జరీ హౌస్ బోట్, పార్టీ, డిన్నర్ క్రూజ్‌లను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అనుమ తులు ఇచ్చింది. విజయవాడలో కృష్ణా నదిలో ఇప్పటికే భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం వంటి పర్యాటక కేంద్రాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కొత్త హౌస్‌బోట్, పార్టీడిన్నర్ క్రూజ్‌లను ఈ పర్యాటక ప్రదేశాలతో అనుసంధానించడం ద్వారా భోజనం, విహారం, బస, వినోదాన్ని ఒకే ప్యాకేజీగా అందించే అవకాశం ఏర్పడనుంది. దీంతో కృష్ణా నదిపై పర్యాటక కార్యకలాపాలు మరింత విస్తరించి, విజయవాడకు కొత్త పర్యాటక ఆకర్షణగా ఈ ప్రాజెక్టు నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇందు కోసం ఓ ప్రైవేట్ సంస్థ బోట్ల నిర్మాణ పనులను ప్రారంభించింది. సు మారు రూ.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు నాలుగైదు నెల ల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు: మంత్రి నిమ్మల



పాలకొల్లు, అక్టోబరు4 ప్రభాత వార్త: పాలకొల్లు పట్టణంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు శనివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నాణ్యత, పూర్తయ్యే గడువుపై సమీక్షి ంచారు. అంబేద్కర్ కళ్యాణ మండపం, శెట్టిబలిజ కళ్యాణ మండపం, ముస్లిం షాదీఖానా, 27వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, లజపతిరాయ్‌పేట పార్కు, సమతా మహిళా సంఘ భవనం, టిడ్కో గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్టీఆర్ కళాక్షేత్రం, నారా చంద్ర బాబు నాయుడు పార్కు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

నిర్మాణ దశ నుంచే అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షి ంచాలని, నాణ్యతలో రాజీపడకూడదని సూచించారు. టిడ్కో గృహాల కాలనీలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీకి హామ్ నిధుల కింద రూ.44.00 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

దివ్యాంగులకు పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 4 ప్రభాతవార్త : జిల్లాలోని ఉత్సాహిక వికలాంగులు, దివ్యాంగులకు భరోసా ఇచ్చే విధంగా వారు పెట్టుకునే చిరు వ్యాపారాలకు తోడ్పాటు అందించే కార్యక్రమం త్వరలో ప్రారంభించనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఒక నెల రోజుల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలను జిల్లా యంత్రాంగంతో కలసి రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో వికలాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన దివ్యంగాన్స్ కార్యక్రమానికి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కాగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేకంగా దివ్యాంగులకు, బధిరులకు భరోసా ఇచ్చే కార్యక్రమాన్ని తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉండగానే ప్రారంభించారు రామ్మోహన్ నాయుడు. ఇందులో భాగంగా 2020వ సంవత్సరం నుండే ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం మెడికల్ క్యాంప్‌లను నిర్వహించడంతో పాటు వారికి అవసరమైన పరికరాలను సైతం ఎంపి ల్యాడ్స్ నిధుల నుండి సమకూర్చి. లబ్దిదారులకు ఉచితంగా పంపిణీ చెయ్యడం ప్రారంభించారు.

కేంద్ర మంత్రి అయిన తరువాత ఈ సేవలకు మరింత వేగాన్ని అందించిన కేంద్ర మంత్రి సి.ఎస్.ఆర్ నిధుల నుండి పెద్ద ఎత్తున జిల్లాలోని బధిరులకు ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ప్రహసనంలా ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తంగా నాలుగు మెడికల్ క్యాంప్‌లను దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ నాలుగు కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు 2313

మంది లబ్దిదారులకు 4491 పరికరాలు మొత్తంగా 7 కోట్ల 98 లక్షల రూపాయల విలువైన వాటిని ఉచితంగా పంపిణి చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో 230 మంది లబ్ధిదారులకు 230 వాహనాలను అందివ్వగా వీటి విలువ 1 కోటి ఏభై లక్షల వరకు ఉంది. ఇందులో 130 ఎలక్ట్రిక్ ట్రై వెహికల్స్, 100 ఎలక్ట్రిక్ వీల్ చైర్స్ ఉన్నాయి. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రామ్మోహన్ నాయుడు తన చేతుల మీదుగా లబ్దిదారులకు ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను, ఎలక్ట్రిక్ వీల్ చైర్‌లను అందించారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎయిర్ పోర్ట్ ఆథారిటి ఆఫ్ ఇండియా జాయింట్ జనరల్ మేనేజర్ రాం జీ ప్రసాద్, అలిమ్కో సంస్థ మేనేజర్ రవి శంకర్, కూటమి నేతలు పాండ్రంకి శంకర్, అరవల రవీంద్ర, పి.ఎం.జే బాబు, ఆర్డివో సాయి ప్రత్యూష, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖా అధికారులు, కూటమి శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యారు.

సుప్రీం తీర్పు రాగానే మునిసిపల్ ఎన్నికలు: మంత్రి నారాయణ

నెల్లూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త - వైద్యం : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖచ్చితంగా జరుగుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తా మని తెలిపారు. ఎన్నికలు నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సి న సుమారు రూ.12 వేల కోట్ల నిధులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నెల్లూరు పర్యటనలో మున్సి పల్ ఎన్నికలపై మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశించారని చెప్పారు. అయితే బీసీ రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని, తీర్పు వచ్చిన వెంటనే ఎన్నికలకు వెళ్తామని పేర్కొన్నారు. గతంలో 23 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం ద్రోహం చేసిందని నారాయణ విమర్శించారు.వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటుందని మంత్రి తెలిపారు.

నెల్లూరు సిటీలో రూ.3.1 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం: నెల్లూరు నగర అభివృద్ధి పనులల్లో మంత్రి నారాయణ మరింత వేగం పెంచారు. నగరంలోని పలు డివిజన్లలో ఒకే రోజు రూ.3.1 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. సచివాలయ భవనాలు, సీసీ రోడ్లు, పార్కు ప్రహరీ, గ్రీనరీ తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించి అధికా రులకు పలు సూచనలు చేశారు. 11వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో రూ.కోటితో నిర్మించనున్న సచివాలయ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఇదే ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హైస్కూల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పార్కు స్థలానికి రూ.30 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

సిఎం, డి.సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ప్రొద్దుటూరు, అక్టోబరు4 : ప్రభాతవార్త:రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంయుక్తంగా అధికారులకు సూచించారు.ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి ప్రొద్దుటూరు అమృత్‌నగర్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన రెండు హెలీప్యాడ్లను పరిశీలించారు. హెలీప్యాడ్ల వద్ద భద్రత, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ఇతర అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జలజీవన్ మిషన్-అమరజీవి జలధార కార్యక్రమ లాంచింగ్ కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీ క్షి ంచి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తదుపరి బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించిన

మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు భద్రతా ఏర్పాట్లు, వీఐపీ గ్యాలరీలు, సభా వేదిక, ప్రజల గ్యాలరీలు, పార్కింగ్, రాకపోకల మార్గాలు తదితర ఏర్పాట్లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మంత్రులు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటన లకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య సదుపా యాలు, పార్కింగ్, రవాణా తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు.

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్‌పంటలు లాభదాయకం

కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి ఠాకూర్

శ్రీకాళవాస్తి, అక్టోబరు 4 ప్రభాత వార్త: అయిల్‌ఫామ్ తోటల్లో అంతర్ పంటలు లాభదా యకమని కేంద్ర వ్యవసాయ సహాయ మంత్రి రామ్‌నాధ ఠాకూర్ అన్నారు. ఆదివారం కేంద్ర మం త్రి హార్టికల్చర్ అధికారులతో కలసి శ్రీకాళ హస్తి మండలం వేడాం గ్రామంలో పర్యటించారు.ఇక్కడ బాలిరెడ్డి అనే రైతు సాగు చేస్తున్న అయిల్ ఫామ్ తోటలను పరిశీలించారు.ఈ సంద ర్భంగా రైతు బాలిరెడ్డితో మంత్రితోపాటు ఆ శాఖ అధికారులు ముఖా ముఖిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోటను మంత్రి పరిశీలించారు. రైతు బాలిరెడ్డితో ఎందుకు సాగు చేస్తున్నారు?ఈ ఆలోచన ఎలా వచ్చింది?ఈ పంట ద్వారా లాభం ఎంత వస్తుంది? అనే అంశాలను చర్చించారు. రైతు వివరిస్తూ గతంలో వాణిజ్యపంటలు వేరుశెనగ, చెరకు పండించే వారమని అయితే రెండు పంటలు ఇక్కడి వాతవారణంకు అనుకూలంగా లేదని అంతేకాక కూలీల సమస్య జటిలంగా ఉందని వివరించారు.

శివయ్య సేవలో కేంద్ర మంత్రి పూజలు

శ్రీకాళహస్తి,అక్టోబరు 4 ప్రభాతవార్త:దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం కేంద్ర వ్యవసాయ,రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీరామ్‌నాద్ ఠాకూర్ పూజలు జరిపించుకున్నారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఓ బికె వెంకటేశులు, ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలతో పాటు నాయకులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సక్రమించిన అధికారాలను ఉపయోగించి ఋణగ్రహీత తాటపూడి ప్రసన్నకుమార్ (ఋణగ్రహీత), తాటపూడి చినపాప (సహ-ఋణగ్రహీత), (ఋణ ఖాతా నెం. 23660002405223)లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న రూ.6,78,725/- (ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ 27-ఏప్రిల్-26వ తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.

ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న ఋణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.

ఋణగ్రహీత/సహఋణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 30వ రోజు సెప్టెంబర్ 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.

ముఖ్యంగా ఋణగ్రహీత/సహఋణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, 27-ఏప్రిల్-26వ నాటికి రూ.6,78,725/- (ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జికి లోబడి ఉంటుంది.

హామీగా ఉంచిన ఆస్తులను వినియోగించడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని ఋణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

స్థిరమైన ఆస్తుల వివరణ

చోడవరం గ్రామ పంచాయితీ పరిధిలోని చోడవరం గ్రామం, 3వ బ్లాక్‌లో, R.S. నం. 368/1లో ఉన్న 177.5 చదరపు గజాలు=98.23 చదరపు మీటర్ల స్థలం మరియు దానిపై ఉన్న RCC డాబా ఇల్లు D.No. 3-31, అసెస్‌మెంట్ నం. 449. ఈ ఆస్తిలో అన్ని తలుపులు, ద్వార బంధాలు, కిటికీలు, పైకప్పు మొదలైనవి; అలాగే విద్యుత్ పరికరాలు, నీటి మార్గాలు, నడక దారులు మరియు అన్ని రకాల అనుబంధ హక్కులు ఇమిడి ఉన్నాయి.హద్దులు:

తూర్పున 48-00 అడుగులు - జుట్టుక బులిసత్తెయ్యకు చెందిన ఖాళీ స్థలం; పడమరన 46-00 అడుగులు - పంచాయతీ సిమెంట్ రోడ్డు; ఉత్తరాన 22-00 అడుగులు - నడక దారి; దక్షిణాన 23-00 అడుగులు - తాటపూడి వెంకన్నకు చెందిన ఖాళీ స్థలం.

తేది: 30/సెప్టెంబర్/2026 అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

మదనపల్లి ప్రజల ఉత్సాహాన్ని

కాంగ్రెస్ తప్పుద్రోవపట్టిస్తుంది

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో చేసిన పోస్టుపై

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవారప్రతినిధి: కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటుగా స్పందించారు. జైరాం రమేశ్ మదన పల్లి ఘటనను అర్థం చేసుకున్న తీరు వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజల్లో కనిపించింది ఆగ్రహం కాదని అపారమైన ఉత్సాహం, అనూహ్య స్పందన అని చంద్రబాబు తెలిపారు. సభ సజావుగా కొనసాగేందుకు ప్రజల ఉత్సాహం కారణంగా తాను కొద్దిసేపు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించారు. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా చిత్రీకరించిన తీరు చూస్తే, ప్రజల ఆలోచనలకు జైరాం రమేశ్ ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాలతో సోషల్ మీడియాలో చేసే కథనాలు, ప్రజలు స్వయంగా వ్యక్తం చేసిన స్పందనను మార్చలేవని సీఎం చంద్రబాబుస్పష్టం చేశారు.

జైరాం రమేశ్ తప్పుడు ప్రచారం సరికాదు
-మంత్రి లోకేశ్

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తప్పుడు ప్రచారం సరికాదంటూ మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో గట్టి కౌంటర్ ఇచ్చారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండానే ఫేక్ న్యూస్‌ను ట్వీట్ చేయడం సీనియర్ నేతగా ఆయన స్థాయికి తగదని మండిపడ్డారు. మదనపల్లిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగాన్ని ఉద్యోగాలు కోరుతూ స్థానిక యువత అడ్డుకున్నారంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని లోకేశ్ స్పష్టం చేశారు.

తల్లికి వందనం పథకం రెండో విడత

నిధుల విడుదలకు మార్గం సుగమం

అమరావతి,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో తల్లికి వందనం పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు.

అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి

కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈకేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

ఉక్రెయిన్‌లో భారత్ ఫార్మాకంపెనీపై రష్యాదాడి

కీవ్, అక్టోబరు 4: రష్యాఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్‌నకు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994 లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది. గత కొంతకాలంగా రష్యా చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది.

ఎపిలో బిపిసిఎల్ ప్రాజెక్టుకు

కేంద్రం గ్రీన్ సిగ్నల్

అమరావతి.అక్టోబరు4,ప్రభాతవార్తప్రతినిధి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (తీశిదిలి) ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.96,862 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టుకు తాజాగా పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఏటా 912 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ కాంప్లెక్స్ ద్వారా ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, ప్రాజెక్ట్ ప్రాంగణంలో 30 శాతం మేర (సుమారు 1,563 ఎకరాలు) గ్రీన్ బెల్ట్‌గా అభివృద్ధి చేసేందుకు బీపీసీఎల్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రాజెక్ట్ రాకతో రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మరింత ఊతెక్కనుంది.

అమరావతి మీదుగా

ఎర్రుపాలెం- నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. దీనిలో భాగంగా నాలుగో ప్యాకేజీకి రైల్వేశాఖ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ఎర్రుపాలెం నుంచి కృష్ణా నది దాటాక వడ్డామాను వరకు మూడు ప్యాకేజీలకు టెండర్లు పిలవగా, ఇప్పుడు చివరిదైన నాలుగో ప్యాకేజీకి కూడా మోక్షం లభించింది. రాజధాని ప్రాంతంలోని వడ్డామాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణానికి రూ.599.33 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. బిడ్లు సమర్పించేందుకు నవంబరు 23 తుది గడువుగా నిర్ణయించారు. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం ఈపీసీ విధానంలో చేయనున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సంస్థ నిర్మాణ పనులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఇంజినీర్లు పేర్కొన్నారు. మొత్తం ప్రాజెక్టు 58.10 కిలోమీటర్ల పొడవు ఉండి నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి మూడు ప్యాకేజీలకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించగా, తాజాగా నాలుగో ప్యాకేజీకి కూడా టెండర్ లను ఆహ్వానించారు. ఈ లైన్ పూర్తయితే అమరావతి రాజధాని ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగవడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి కూడా

ఊతం లభిస్తుంది. వడ్డమాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ రైల్వే ప్రాజెక్ట్ లో మొత్తం తొమ్మిది చోట్ల రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు. పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పరావురు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో ఈ రైల్వే ప్రాజెక్టు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. రాజధానికి మంచి రైలు సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల పెట్టుబడులు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఎక్కడైతే రవాణా సదుపాయాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అని భావించిన క్రమంలోనే రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధికి రోడ్డు, రైల్వే, ఆకాశ మార్గాలను కూడా సిద్ధం చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది.

తూటాల గాయాలకు తేనెతో చికిత్స

పాక్ ఉగ్రవాదుల ఆయుర్వేద వైద్యం

హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త: జమ్మూ కాశ్మీర్ లోయలో భారత దళాల కాల్పుల్లో గాయపడడుతున్న ఉగ్రవాదులు తప్పించుకుని పారిపోయేందుకు వీల్లేని పరిస్థితుల్లో అడవుల్లో వుంటూనే తమ గాయాలకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా తేనె ద్వారా చికిత్స తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఆయుర్వేద వైద్యంలోని కొన్ని పద్ధతులను అనుసరించి ఉగ్రవాదులు తేనె ద్వారా చికిత్స తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలకు అందిన సమాచారం ద్వారా పోలీసు ఉన్నతాధికారులు నిర్ధారించారు. కాశ్మీర్‌లోని బడ్‌గామ్ జిల్లాలో ఇటీవల జరిగిన భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో పాక్ ఉగ్రవాది, ఆ దేశానికి చెందిన సైనిక స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ మాజీ కమాండో మహమ్మద్ ఆసిఫ్ అలిమాస్ హాషీం మూసా హతమయ్యాడు. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న టెర్రరిస్టుల్లో ఇతను కూడా వుండడంతో పాటు కీలకంగా వ్యవహరించాడు. అయితే ఎన్‌కౌంటర్‌లో హతమవక ముందు ఆపరేషన్ షేరువాలీలో పేరిట రాజౌరి సెక్టార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హాషీం మూసాకు తూటా గాయాలయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కీలక ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు 45 రోజులకు పైగా ఆపరేషన్ నిర్వహించడం తెలిసిందే.

ఈ ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకడు హాషీం మూసా కాగా మరొకడు యాసిర్‌గా భద్రతా బలగాలు నిర్ధారించాయి. వీరిద్దరు సహచరులుగా తేలింది. రాజౌరి ప్రాంతంలో గల పూంచ్ అడవుల్లో తలదాచుకున్న సమయంలో హాషీం మూసా తన తూటా గాయాలకు తేనె ద్వారా ఆయుర్వేద పద్ధతుల్లో చికిత్స తీసుకున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందగా ఇది నిజమని భద్రతా బలగాలు నిర్ధారించాయి. తూటా గాయాలకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా వుండేందుకు, గాయాలు పెద్దవిగా కాకుండా వుండేందుకు ఇతను తేనె వాడినట్లు భద్రతా బలగాలు నిర్ధారించాయి. తేనెలోని ఆయుర్వేద గుణాలు తూటా గాయాలను చాలా వరకు నయం చేస్తుందని ఉగ్రవాదులు విశ్వసించినట్లు భద్రతా బలగాలు నిర్ధారించాయి. గత సెప్టెంబర్ నెలలో యాసిర్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాక అతని వద్ద వున్న ఫోన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అందులో హాషీం మూసా తూటా గాయాలకు తేనెతో చికిత్స చేసుకుంటున్న దృశ్యాలు వున్నాయి. మూసా ఆరోగ్య పరిస్థితులను తెలిపేందుకు ఈ ఫోటోలను పాక్‌లోని ఉగ్ర హ్యాండ్లర్లకు కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు పంపారు. తూటా గాయాలు త్వరగా మానాలంటే స్వచ్ఛమైన తేనె వాడాలని హ్యాండ్లర్లు సూచించారు. దీని తరువాత హాషీం మూసా కోసం భద్రతా బలగాలు గాలించగా జరిగిన ఎదురు కాల్పుల్లో అతను చనిపోయాడు. మూసా హత మవడంతో అతని కోసం జమ్మూ కాశ్మీర్ పోలీసులు ఐదేళ్లుగా సాగిస్తున్న వేట ముగిసింది. పదికి పైగా ఉగ్రదాడుల్లో పాల్గొన్న మూసా 14 మంది సైనికులను బలిగొనడంతో పాటు గగన్‌గేర్ సొరంగ నిర్మాణ శిబిరంపై దాడిచేగా స్థానిక వైద్యుడితో పాటు ఏడుగురిని పొట్టన పెట్టుకున్నాడు. దీంతో పాటు సైనిక వాహనంపై దాడిచేసి నలుగురిని చంపాడు.

డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 380 మంది మందుబాబుల పట్టివేత

హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త: జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందుబాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 380 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 343 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది ఆటో డ్రైవర్లు, 25 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 51 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 167 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 77 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 39 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 12 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఇద్దరు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ముగ్గురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

సైబరాబాద్‌లో 97 మంది..

ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 80 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 76 మంది ద్విచక్ర వాహనదారులు, ఐదుగురు ఆటో డ్రైవర్లు, 15 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనాల డ్రైవర్ వున్నారు. పట్టు బడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు. కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 144 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 120 మంది ద్విచక్ర వాహనదారులు. ఆరుగురు ఆటో డ్రైవర్లు, 17 మంది కార్ల డ్రైవరు, మరొకరు భారీ వాహన డ్రైవర్ వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి తెలిపారు.

సింగీతం మరణం చిత్ర రంగానికి తీరనిలోటు

హైదరాబాద్,అక్టోబరు4,ప్రభాతవార్త: సినీరంగంలో ఎన్నో వైవిధ్యభరితమైన చిత్రాలను అందించిన ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్రపరిశ్రమకు, భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వైవిధ్యమైన కథాంశాలను, వినూత్నమైన ఆలోచనలను తెరపై ఆవిష్కరిస్తూ తెలుగు సినిమాకు కొత్త దారులు చూపిన సృజనాత్మక దర్శకుడని స్మరించుకున్నారు. ప్రయోగాత్మకతకు పెద్దపీట వేస్తూ ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించిన సింగీతం శ్రీనివాసరావు తనదైన ముద్రను సినీ చరిత్రలో శాశ్వతంగా వేశారని అన్నారు. దర్శకుడిగానే కాకుండా రచయితగా, ఆలోచనాపరుడిగా, సినిమా పట్ల అపారమైన ప్రేమతో పనిచేసిన కళాకారుడిగా ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.

బిసి విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు 4, ప్రభాతవార్త: బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్య, తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో 100 బీసీ కాలేజి హాస్టళ్లు, 100 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పేద విద్యార్థుల హాస్టళ్ల నిర్వహణ పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ భూములను అమ్మే ఆలోచన విరమించుకోవాలని, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల కోసం స్వంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాలలో కాలేజి విద్యార్థులకు హాస్టల్ సీట్లు లభించక విద్యను మానుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే బీసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు నిర్మించాలని కోరారు. అన్ని పాఠశాలలకు స్వంత భవనాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆఫీసులకు కూడా స్వంత భవనాలు ఉన్నాయని, కేవలం బీసీ

ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

హాస్టళ్లు, గురుకులాలకు మాత్రమే స్వంత భవనాలు లేకపోవటం విచారకరమని అన్నారు. వందల కోట్లు పెట్టి ఫ్లైఓవర్స్, సెక్రటేరియట్, మంత్రులకు, ఎమ్మెల్యేలకు క్వార్టర్స్ నిర్మించే ప్రభుత్వానికి పేద విద్యార్థుల హాస్టళ్లకు స్వంత భవనాలు నిర్మించాలని ఆలోచన లేకపోవటం, బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, బీసీ హాస్టళ్లకు స్వంత భవనాలు అన్ని సౌకర్యాలతో నిర్మించాలని, ఫీజుల బకాయిలు 8,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు సంబంధించిన మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని, కాలేజి హాస్టల్ విద్యార్థులకు బస్ పాస్, ఇతర చిల్లర ఖర్చులకు ప్రతి బాలికకు 1000 రూపాయలు, బాలుడికి 800 రూపాయలు పాకెట్ మనీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు కేవలం ముగ్గురు వర్కర్‌లు ఉండటం వల్ల సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రతి హాస్టల్‌కు అదనంగా ఇద్దరు వర్కర్ల చొప్పున నియమించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం విద్యార్థులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రాజేందర్, నాయకులు రామాంజనేయులు, బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగ యాదవ్, శివకృష్ణ ముదిరాజ్, వేలాది మంది బీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చార్మినార్ వద్ద జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపి లక్ష్మణ్

నషా ముక్త్.. భారత్ లక్ష్యం

చార్మినార్ వద్ద భారీ ర్యాలీలో ఎంపి కె.లక్ష్మణ్

హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 4, ప్రభాతవార్త: ప్రతీ ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మై భారత్ రాష్ట్ర తెలంగాణ శాఖ ఆధ్వర్యంలోచార్మినార్ నుంచి సిటీ కళాశాల వరకు నిర్వహించిన నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన చార్మినార్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, యువతతో పాటు ప్రతీ ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్‌ను అరికట్టడానికి దృష్టి పెట్టాయని ఆయన తెలియజేశారు. చార్మినార్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గుల్జారాహౌస్, చార్‌కమాన్, షెహరాన్ హోటల్, ఫత్తర్‌గట్టి, మదీనా, హైకోర్టు రహదారి మీదుగా సిటీ కళాశాల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌డిబి ఏడి విశాల్ రాజన, మైభారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్వేషన్ చింతల, చార్మినార్ బిజెపి నాయకులు పవన్‌మిశ్రా, నితిన్ కుమార్ అగర్వాల్, ఆకాష్‌అగర్వాల్‌తోపాటు ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో దూడను చంపిన చిరుతపులి

హైదరాబాద్, అక్టోబరు 4,ప్రభాతవార్త: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిల్లర్గి గ్రామ శివారులో శనివారం రాత్రి చిరుతపులి గ్రామానికి చెందిన రైతు పాశం సుధాకర్ గేదె దూడపై చిరుత దాడి చేసి చంపివేసింది. గ్రామస్థుల ఫిర్యాదు తో చిల్లర్గి అటవీ బీట్ అధికారి ప్రభు ప్రసన్న కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనను పరిశీలించారు. మృతి చెందిన గేదె దూడకు పంచనామా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ హైమద్ దూడ మృతికి వన్యప్రాణి కారణమని పేర్కొంటు పోస్టుమార్టం నివేదిక అందించారు. చిరుతపులి సంచరిస్తుండటంతో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్బిఓ ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులను రాత్రివేళల్లో బయట ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని సూచించారు. చిరుత కనిపించినప్పుడు దాని దగ్గరకు వెళ్లడం, దాన్ని తరిమే ప్రయత్నం చేయడం వంటివి చేయకూడదని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చిరుత కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచుతున్నామని తెలిపారు. గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిరుత సంచారానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే అటవీశాఖకు తెలియజేయాలని ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

రిటైర్డ్ రేస్‌హార్స్‌ల సంక్షేమానికి కృషి అభినందనీయం

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

రేస్2విన్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో ఘనంగా ది డెక్కన్ డెర్బీ

హైదరాబాద్ (మలక్‌పేట్), అక్టోబరు 4, ప్రభాతవార్త: రిటైర్డ్ రేస్‌హార్స్‌ల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయమని స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేర్కొన్నారు. రేస్2విన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ది డెక్కన్ డెర్బీ 2026' కార్యక్రమం హైదరాబాద్ రేస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. రెస్ టు విన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వై. గోపీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రేసింగ్, వ్యాపార, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు, రేసింగ్ అభిమానులు సహా సుమారు 250 మంది పాల్గొన్నారు. గుర్రపు పందేల సందడితో పాటు రేసింగ్ నుంచి విరమించిన గుర్రాల పునరావాసం, జీవితకాల సంరక్షణ, సంక్షేమంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా 2027 మార్చిలో ఇన్విటేషన్ కప్ వీకెండ్ సందర్భంగా నిర్వహించనున్న రేస్2విన్ ఫౌండేషన్ గాలాను స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రేస్ టు విన్ నిర్వాహకులు గోపి రావు లు ఆవిష్కరించారు. స్టోరీస్ ఆఫ్ ఇండియా డాక్యుమెంటరీ ప్రమోషనల్ ఫిల్మ్‌ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్ రేస్ క్లబ్‌లో నిర్వహించిన రేసులో బడ్డీ విజేతగా నిలిచింది. ట్రైనర్ మగన్ సింగ్ ఆధ్వర్యంలో బడ్డీ ఈ విజయాన్ని సాధించింది. అనంతరం జరిగిన విజేతల సన్మాన కార్యక్రమంలో జేకే. కె. ముఖేష్ కుమార్, సుబోధ్ కుమార్ అనంతుల, డా. ప్రభాకర్ చౌదరి (తిపురాణి) తదితరులు పాల్గొని విజేతను అభినందించారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ హార్స్ రేసింగ్ కు చాలా చరిత్ర ఉందని, ఆరవ నిజాం కాలం నుంచి మలక్ పేట రేస్ క్లబ్ లో హార్స్ రేసింగ్ జరుగుతోందని తెలిపారు. రిటైర్ అయిన గుర్రాల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ హార్స్ రేసింగ్ ను క్రీడగా పరిగణించాలని కోరారు. పెంచిన జీఎస్టీని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. రేస్ టు విన్ నిర్వాహకులు గోపి రావు మాట్లాడుతూ రేస్ టు విన్ ఫౌండేషన్ లక్ష్యం రేసింగ్ కెరీర్ ముగిసిన తర్వాత కూడా ప్రతి రేస్‌హార్స్‌కు సంరక్షణ, గౌరవం, సురక్షితమైన భవిష్యత్తు అందించడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. రిటైర్డ్ రేస్‌హార్స్‌ల కోసం స్థిరమైన ఆఫ్టర్‌కేర్ వ్యవస్థను నిర్మిస్తూ, రేసింగ్ కమ్యూనిటీతోపాటు



రేస్ టు విన్ ఫౌండేషన్ గాలాను ఆవిష్కరిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రేస్ క్లబ్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రేస్ టు విన్ నిర్వాహకులు గోపిరావు

సమాజాన్ని భాగ స్వామ్యం చేయడం ద్వారా రేస్ ముగిసినా.. సంరక్షణకు ముగింపు ఉండకూడదు అనే సందేశాన్ని ఆచరణలోకి తీసుకు రావడమే ఫౌండేషన్ సంకల్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' దిశగా నెక్స్ట్‌జెన్ జీఎస్టీ

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఒకే దేశం ఒకే పన్ను లక్ష్యంతో 2017లో ప్రవేశపెట్టిన జీఎస్టీ పరోక్ష పన్నుల విధానంలో ఒక చారిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. ఆ తొమ్మిదేళ్ల అమల్లో ఎదురైన అనుభవాలు, పన్ను చెల్లింపుదారులు మరియు రాష్ట్రాల సూచనలను ప్రామాణికంగా తీసుకుని, ఇప్పుడు నెక్స్ట్‌జెన్ జీఎస్టీ రూపంలో ఆర్థిక వ్యవస్థను తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టికి అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ నెక్స్ట్‌జెన్ జీఎస్టీకి ప్రధానంగా రెండు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. మొదటిది పన్ను రేట్లను తగ్గించి, వాటిని సరళీకరించడం. రెండవది పన్ను నిబంధనలను సులభతరం చేయడం. ఇందులో భాగంగా సవరించిన నూతన పన్ను రేట్లు గత యేడాది సెప్టెంబరు22 నుండి ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన తదుపరి దశ ప్రక్రియ సంస్కరణలు త్వరలోనే జీఎస్టీ కౌన్సిల్ ముందుకు రానున్నాయి. ఈ సంస్కరణలన్నింటి లక్ష్యం ఒక్కటే. సామాన్య కుటుంబాల బడ్జెట్కు ఉపశమనం అందించడం, వ్యాపార వర్గాలకు స్పష్టత, నమ్మకాన్ని ఇవ్వడం మరియు పన్ను చెల్లింపుదారులు ఎలాంటి అనవసర ఇబ్బందులు లేకుండా తమ బాధ్యతలను సజావుగా నెరవేర్చుకునే అనుకూల వాతావరణాన్ని సృష్టించడం. జాతీయ లక్ష్య సాధన కోసం తమ బాధ్యతలను నెరవేరుస్తూనే, భాగస్వామ్య స్ఫూర్తిని చాటుకున్న రాష్ట్ర ప్రభుత్వాల నిబద్ధత అభినందనీయం. జీఎస్టీ సాధించిన ఈ పురోగతి అంతా కూడా సహకార సమాఖ్య స్ఫూర్తికి స్పష్టమైన నిదర్శనం. మనం చేపట్టిన సంస్కరణలు ఎంతటి సానుకూల ఫలితాలను ఇస్తున్నాయో గణాంకాలే చెబుతున్నాయి. 2025 అక్టోబర్ నుండి 2026 జూలై మధ్య కాలంలో, పన్ను పరిధిలోకి వచ్చిన వ్యాపార సరుకులు మరియు సేవల విలువ గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 25.8 శాతం పెరిగింది. పన్ను రేట్లను తగ్గించినప్పటికీ ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడం హర్షణీయం. ఈ ఆర్థిక స్థిరత్వం రాబడి గణాంకాలలో కూడా స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. 2026 ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12.46 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 11.6 శాతం వృద్ధి. రీఫండ్లు పోను నికర వసూళ్లు కూడా అర్ధ సంవత్సర కాలంలో 10.4 శాతం పెరిగాయి. ఈ వృద్ధి కేవలం ఒకటిరెండు రంగాలకే పరిమితం కాలేదు. దేశంలోని మొత్తం 11 వ్యాపార రంగాలు మరియు అన్ని ప్రధాన రాష్ట్రాలలో పన్ను విధించదగిన విక్రయాలు పెరిగాయి. సంస్కరణలతో నేరుగా వినియోగదారులకు జరిగిన అమ్మకాలు కూడా 26.7 శాతం మేర పుంజుకున్నాయి. కుటుంబాల కొనుగోలు శక్తి పెరిగితే మార్కెట్లో వస్తు సేవల డిమాండ్ పెరుగుతుంది. ఆ ప్రయోజనం క్రమంగా చిల్లర వ్యాపారి నుండి సరఫరాదారునికి, చివరికి ఉత్పత్తిదారునికి కూడా చేరుతుంది.

చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు జాతీయ మార్కెట్ ద్వారాలు తెరుచుకోవడం ఎంతో లాభదాయకం. టైర్2, టైర్3 నగరాల్లోని చిన్న వ్యాపారాలు తమ పరిధిని దాటి ఇతర ప్రాంతాల వినియోగదారులను చేరుకోగలిగినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుంది. జీఎస్టీ తెచ్చిన ఉమ్మడి జాతీయ వ్యవస్థ ఈ అనుసంధానానికి ఎంతగానో సహకరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి కేంద్ర, రాష్ట్ర పరిధిలోని జీఎస్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్య దాదాపు 1.71 కోట్లకు చేరింది. ఇది గతేడాదితో పోలిస్తే 15 శాతం పెరుగుదల. అలాగే 2026 ఏప్రిల్-జూలై కాల వ్యవధిలో గడువు తేదీలలోగా దాఖలైన జీఎస్టీఆర్3బీ రిటర్నులు 12.6 శాతం పెరిగాయి. భాగస్వామ్యం పెరుగుతున్న కొద్దీ పన్ను పరిపాలనా విభాగంపై బాధ్యత కూడా పెరుగుతుంది. మరోవైపు, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రక్రియ కూడా గణనీయంగా మెరుగైంది. చెల్లించాల్సిన పన్ను బాధ్యతలో క్రెడిట్ల వాటా పెరగడమే కాకుండా, పేరుకుపోయిన క్రెడిట్ పరిమాణం తగ్గింది. చిన్న పరిశ్రమలకు వర్కింగ్ క్యాపిటల్ అనేది రక్త ప్రసరణ లాంటిది. క్రెడిట్లు సకాలంలో లభించడం వల్ల చిన్న వ్యాపారులు సులభంగా ఇన్పుట్‌లు కొనుగోలు చేసి, ఆర్డర్లు పూర్తి చేయడానికి మార్గం సుగమమైంది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలోనే దాదాపు రూ.1.80 లక్షల కోట్ల మేర రీఫండ్లను నేరుగా వ్యాపార సంస్థలకు వాపసు చేశాం. ఐజీఎస్టీ సెటిల్మెంట్లతో కలిపి రాష్ట్రాల మొత్తం ఎస్ జీఎస్టీ ఆదాయం ఈ ఏప్రిల్- సెప్టెంబర్ కాలంలో దాదాపు 16 శాతం పెరిగింది. ఈ నిధులు మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సంక్షేమానికి దోహదపడతాయి. అక్టోబర్ 7న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాబోయే ప్రతిపాదనలు ఈ దిశగానే పనిచేస్తాయి. రిజిస్ట్రేషన్, రిటర్న్లు, రీఫండ్లు, వివాదాల పరిష్కారం మరియు ఐటీసీ ప్రవాహాన్ని మరింత సులభతరం చేసి, వ్యాపార వ్యయాన్ని తగ్గించడమే మా ప్రాధాన్యత. జీఎస్టీ అందించిన ఈ బలం, అనుభవంతో ప్రత్యక్ష పన్నులలో కూడా సంస్కరణలను ముమ్మరం చేస్తున్నాం. వ్యాపార రంగానికి ఆ నమ్మకాన్ని అందిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలకనుగుణంగా సమర్థవంతమైన, సమ్మోహనకరమైన వికసిత్ భారత్ వైపు అడుగులు వేద్దాం.

బాలిక కడుపులో వెంట్రుకల గడ్డ

తొలగించిన వైద్యులు

తిరువనంతపురం, అక్టోబరు 4: వైద్య శాస్త్రంలోనే అత్యంత అరుదుగా కనిపించే కేసు ఒకటి కేరళలో వెలుగుచూసింది. 9 ఏళ్ల బాలిక కడుపులో పేరుకుపోయిన కిలో బరువున్న వెంట్రుకల గడ్డను వైద్యులు విజయవంతంగా తొలగించారు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న ఆ చిన్నారికి రాపుంజెల్ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటన తిరువనంతపురం సమీపంలోని నెయ్యట్టింకరలో ఉన్న నిమ్స్ మెడిసిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. కొద్ది రోజులుగా తగ్గని కడుపునొప్పి, తరచూ వాంతులు అవుతుండటంతో కుటుంబ సభ్యులు బాలికను నిమ్స్ మెడిసిటీకి తీసుకొచ్చారు. ప్రాథమికంగా సమస్యను గుర్తించలేని వైద్యులు, బాలిక ఆరోగ్య పరిస్థితిని లోతుగా పరిశీలించేందుకు అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో బాలిక జీర్ణాశయంలో, చిన్న పేగుల్లో ఏదో అసాధారణమైన అడ్డంకి ఉన్నట్లు గుర్తించారు. దీంతో మరింత స్పష్టత కోసం ఎండోస్కోపీ పరీక్ష నిర్వహించగా, వైద్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలిక కడుపు, చిన్న పేగుల్లో పెద్ద మొత్తంలో వెంట్రుకలు ఒక ముద్దలా పేరుకుపోయి ఉన్నాయని తేలింది. ఈ వెంట్రుకల గడ్డ కారణంగానే పేగుల్లో తీవ్రమైన అడ్డంకి ఏర్పడిందని, దానివల్లే బాలిక అనారోగ్యానికి గురైందని నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి దానిని తొల గించాలని నిర్ణయించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేపట్టింది. గంటల తరబడి శ్ర మించి, బాలిక కడుపు, చిన్న పేగుల నుంచి సుమారు కిలో బరువున్న వెంట్రుకల గడ్డను పూర్తిగా తొలగించారు. ఈ వైద్య పరిస్థితిని రాపుంజెల్ సిండ్రోమ్ అని పిలుస్తారని వైద్యులు వివరించారు. ఇది ఒకరకమైన ట్రైకోబెజోర్. తమ వెంట్రుకలను తామే పీక్కుని తినే మానసిక అలవాటు (ట్రైకోఫేజియా) ఉన్నవారిలో ఇది కనిపిస్తుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 100 లోపే ఇలాంటి కేసులు నమోదైనట్లు వైద్య నివేదికలు చెబుతున్నాయి. ఇది ఎక్కువగా యుక్తవయసు బాలికలలో కనిపిస్తుంది. క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యబృందాన్ని పలువురు అభినందించారు.

జీలకర్ర పొడి రీకాల్‌కు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశం

పనాజి, అక్టోబరు 4: దేశవ్యాప్తంగా ఆహార భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేసే నేపథ్యంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ప్రముఖ బ్రాండ్లు, సంస్థలపై కఠిన చర్యలు చేపట్టింది. నాణ్యతా లోపాలు, తీవ్రమైన పరిశుభ్రతా లోపాలు వెలుగుచూడటంతో ఈ సంచలన నిర్ణయాలు తీసుకున్నట్లుగా అధికారిక ప్రకటన వెలువడింది. ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రీప్యాక్డ్ జీలకర్ర పొడి నమూనాలు ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లుగా తేలడంతో, ఆ సంస్థ వెంటనే ఆ ఉత్పత్తులను మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలని ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆదేశించింది. గోవాలోని మెస్సర్స్ రివర్సైడ్ రిసార్ట్స్, హాలిడే హోమ్స్ ఫ్యాక్టరీ నుంచి సేకరించిన ఈ జీలకర్ర పొడి నమూనాను ఫుడ్ అనలిస్ట్‌లు పరీక్షించగా, అనుమతించిన గరిష్ట పరిమితిని మించి అజోక్సిస్ట్రోబిన్, థియామెథోక్సమ్ పురుగు మందుల అవశేషాలు ఉన్నట్లుగా తేలింది. ఈ నమూనాను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్2006 ప్రకారం సురక్షితం కాదని ప్రకటించారు. కంపెనీ అప్పీల్ మేరకు రిఫరల్ ఫుడ్ లాబొరేటరీలో జరిపిన పరీక్షల్లోనూ ఇది సేఫ్ కాదని నిర్ధారణ కావడంతో, సంబంధిత బ్యాచ్ నెం.N080668761 ఉత్పత్తులను తక్షణమే మార్కెట్ నుంచి రీకాల్ చేయాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా మెస్సర్స్ క్రియోటివ్ బేకర్స్ అండ్ కన్ఫెక్షనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎఫ్ఎస్ ఎస్ఏఐ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. ఆహార ఉత్పత్తి, హ్యాండ్లింగ్ ప్రాంతాల్లో ధూళి, గ్రీజు, బూజు గూళ్లు, ఈగలు వంటి తీవ్రమైన పరిశుభ్రతా లోపాలు తనిఖీల్లో వెలుగుచూశాయి. తుప్పు పట్టిన కంటైనర్లలో ముడి పదార్థాలను నిల్వ చేయడం, కీటకాల బెడదను నివారించడంలో విఫలమవడం, కిటికీలకు కీటకాల నిరోధక మెష్‌లు లేకపోవడం వంటి లోపాలు గుర్తించారు. ఆహార భద్రత రికార్డులను సరిగా మెయిన్‌టెయిన్ చేయకపోవడం, వ్యర్థాలు పేరుకుపోవడం వంటి కారణాలరీత్యా ఈ చర్యలు తీసుకున్నట్లుగా అధికారుల వెల్లడించారు.

మాజీ సిఎం శంకర్‌సింహ్ వాఘేలా వ్యాఖ్యల దుమారం

అహ్మదాబాద్, అక్టోబరు 4: గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేత శంకర్‌సింహ్ వాఘేలా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రవర్ణాల వారు మ్యానువల్ స్కావెంజింగ్ చేస్తే నెలకు రూ.50,000 ఇస్తానని ఆయన చేసిన సవాల్ వివాదాస్పదంగా మారింది. నర్మదా జిల్లాలోని సాగ్‌బారాలో జరిగిన ఆదివాసీ రైతుల సమావేశంలో వాఘేలా మాట్లాడారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ అది ఎవరూ ఇస్తున్న భిక్షకాదని, దశాబ్దాలుగా అనుభవించిన వివక్షకు బదులుగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే పటేల్, బనియా, బ్రాహ్మణ సామాజిక వర్గాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వాఘేలా వ్యాఖ్యలపై బీజేపీ, పాటీదార్, బ్రాహ్మణ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీజేపీ నేత, బ్రహ్మ సమాజ్ నాయకుడు యజ్ఞేశ్ దవే తీవ్రంగా స్పందిస్తూ వాఘేలానే తన ఇంట్లో ఆ పని చేస్తే నెలకు రూ.5 లక్షలు ఇస్తానని ప్రతి సవాలు విసిరారు. పాటిదార్ నాయకుడు అల్పేష్ కథీరియా కూడా వాఘేలా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసక్తికరంగా, ఈ కార్యక్రమానికి గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డాతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు కూడా హాజరయ్యారు. ఇదే సమయంలో శంకర్‌సింహ్ వాఘేలా తిరిగి కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 2017లో పార్టీని వీడిన ఆయన, బీజేపీని ఓడించేందుకు తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమని ఇటీవల ప్రకటించారు. దీనికి సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం. త్వరలో జరగనున్న గాంధీనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున ప్రచారం కూడా చేయనున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతుండగా, కాంగ్రెస్‌లో ఆయన చేరికపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

రష్యాలో భారతీయులకు 70వేల ఉద్యోగాలు: కేంద్ర మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, అక్టోబరు 4: భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70వేల మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్ రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్‌సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్‌యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

త్రిపురలో అర్ధరాత్రి భూప్రకంపనలు



అగర్తలా, అక్టోబరు 4: ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా భూమి కంపించడంతో జనం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ధలై జిల్లా కేంద్రంగా భారీ శబ్దంతో ప్రకంపనలు రావడంతో, నిద్రలో ఉన్న జనం భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 3.8గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సరిగ్గా అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట ప్రాంతంలో ఈ సంఘటన జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం ఈ రోజు తెల్లవారుజామున 00:57:38 గంటలకు భూమి అంతర్భాగంలో ప్రకంపనలు మొదలయ్యాయి. ధలై జిల్లాలోని రేఖాంశం 23.757 ఉత్తరం, అక్షాంశం 91.995 తూర్పు ప్రాంతంలో, భూఉపరితలానికి దాదాపు 30 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం నమోదైంది. ఈ మేరకు సీస్మోలజీ విభాగం ఎక్స్ వేదికగా అధికారికంగా సమాచారాన్ని పంచుకుంది. స్వల్ప తీవ్రతతో వచ్చిన భూకంపం కావడంతో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించినట్లు నివేదికలు అందలేదని స్థానిక యంత్రాంగం స్పష్టం చేసింది.

ఇండియా కూటమిలోకి టివికె

చెన్నై, అక్టోబరు 4: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ అధికారికంగా ప్రకటించారు. చెన్నైలోని టీపీసీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి టీవీకే తరఫున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు.

టీవీకే చేరికను చారిత్రక దినంగా అభివర్ణించిన మాణికం టాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

చాట్‌జిపిటిని వాడుకున్న కేతన్ హంతకి



పూణె, అక్టోబరు 4: ప్రేమించి, నిశ్చితార్థం చేసుకున్న యువకుడినే అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటనలో సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. పుణేలోని లోహగడ్ కోట వద్ద కేతన్ అగర్వాల్ మరణం కేసులో పోలీసులు దాఖలు చేసిన 5,053 పేజీల చార్జిషీట్ ప్రేమ ముసుగులో జరిగిన ఘోరమైన కుట్రను, టెక్నాలజీని నేరానికి ఎలా వాడుకున్నారో కళ్లకు కట్టింది. ఈ హత్య కేసులో కేతన్‌కు కాబోయే భార్య సియా గోయల్, ఆమె స్నేహితులు చేతన్ చౌదరి, రితేష్ హంగేలను పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. చార్జిషీట్ ప్రకారం, సియా గోయల్ ఈ హత్యకు ప్రధాన సూత్రధారి. హత్యకు నెల రోజుల ముందు, అంటే మే 31న, సియా తన ప్రియుడు కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లింది. సరిగ్గా అతడిని ఎక్కడైతే లోయలోకి తోసి చంపాలనుకుందో, అదే ప్రదేశంలో వెనుక నుంచి వివిధ యాంగిల్స్‌లో ఫోటోలు తీసింది. ఇది పక్కా ప్రణాళికలో భాగమేనని పోలీసులు అనుమాని స్తున్నారు. అనంతరం జూన్ 18న, ఓ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా కేతన్‌ను ఆకర్షించి, మరోసారి లోహగడ్ కోటకు రప్పించారు. అక్కడ, ముందుగా సియా గోయల్ కేతన్‌ను బలంగా నెట్టగా, ఆమె స్నేహితుడు చేతన్ చౌదరి బలంగా తన్ని లోయలోకి పడేశాడని చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో డిజిటల్ ఆధారాలు అత్యంత కీలకంగా మారాయి. హత్యకు ముందే సియా కేతన్ తల్లికి క్షమాపణ చెబుతూ ఓ సందేశాన్ని రాయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనమైన చాట్‌జీపీటీ సాయం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతటితో ఆగకుండా, హత్య తర్వాత దుఃఖాన్ని ఎలా నటించాలి ఒకవేళ పోలీసులు పట్టుకుంటే ఎలా తప్పించుకోవాలి విచారణను ఎలా ఎదుర్కోవాలి వంటి ప్రశ్నలను కూడా చాట్‌జీపీటీలో వెతికినట్లు ఆధారాలు లభించాయి. క్రైమ్, మర్డర్ మిస్టరీ సినిమాలు చూడటం, పాడ్‌కాస్ట్‌లు వినడం కూడా ఈ కుట్రలో భాగమేనని పోలీసులు తమ నివేదికలో తెలిపారు. కేతన్ మరణం తొలుత ప్రమాదవశాత్తు జరిగిందని అందరూ భావించారు. అయితే, కుటుంబ సభ్యుల అనుమానాలు, పోలీసుల లోతైన విచారణతో ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్య అనే కోణం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ 5,053 పేజీల చార్జిషీట్ కేసు విచారణలో కీలక ఆధారం కానుంది.



ప్రేయర్ చేసుకుంటానని వెళ్లి.. వెనుక నుంచి గొడ్డలితో నరికాడు

పైలట్ స్మిత్ మచ్చర్

అబుదాబి, అక్టోబరు 4: ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై కో-పైలట్ దాడి చేసిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడికి సంబంధించి కెప్టెన్ మచ్చర్ కీలక విషయాలు వెల్లడించారు. విమానం నడుపుతున్న సమయంలో కో-పైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పి తన వెనక్కి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పైలట్లు ఇలా ప్రార్థనలు చేసుకోవడం సర్వసాధారణ విషయం కావడంతో తాను అడ్డు చెప్పలేదన్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే కాక్‌పిట్‌లో ఉండే గొడ్డలితో తనపై వెనకనుంచి దాడి జరిగినట్లు గుర్తు చేసుకొన్నారు. దీంతో వెంటనే తాను అప్రమత్తమై కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు వెల్లడించారు. కానీ, అతడు తనను అడ్డుకొని తలుపులు తిరిగి మూసివేశాడన్నారు. ఎలాగైనా ప్రయాణికులను కాపాడాలనే ఆలోచనతో బలం కూడదీసుకొని మరోసారి తలుపులు తెరిచి సాయం కోరడంతో ప్రయాణికులు లోపలికివచ్చి అతడిని బంధించారన్నారు.

విద్యార్థిగా రెండేళ్లు ఆస్ట్రేలియాలో.. ఈ దాడిలో నిందితుడిగా భావిస్తున్న ఒమన్‌కు చెందిన హమామ్‌అల్-హమ్మామీగా(29)కు ఉగ్రవాద భావజాలం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతడు ఒమన్, సిరియా, మొరాకోల్లోనే కాకుండా ఆస్ట్రేలియాలోనూ రెండేళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లి 2017 వరకు అక్కడే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అతడు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే విషయంపై ఆస్ట్రేలియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ (ఎఎస్ఐఒ) సహా పలు ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి.

హమామ్‌కు అల్‌ఖైదా మద్దతు

మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్-ఖైదా కో-పైలట్ హమామ్ అల్-హమ్మాదీకి మద్దతుగా పలు పోస్టులు చేస్తోంది. 9/11 దాడులను ప్రస్తావిస్తూ అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన విమానాల్లో ఇటువంటి దాడులు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈమేరకు దాని వారపత్రికలో కథనం ప్రచురించింది. అంతేకాకుండా ట్విన్ టవర్స్‌పై దాడి, ఫ్లైదుబాయ్ విమానానికి సంబంధించిన దృశ్యాలను సైతం దీనిలో ప్రచురించడం గమనార్హం.

విరిగిపోయిన రడ్డర్‌తో విమానం ల్యాండ్ ఓ అద్భుతం

వాషింగ్టన్, అక్టోబరు 4: ఫ్లైదుబాయ్ విమానం 'ఎఫ్‌జడ్ 1073' ల్యాండ్ కావడం ఏవియేషన్ అద్భుతం. దీనిలోని కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై 'క్రాష్ యాక్స్' (అత్యవసర సమయంలో వాడే గొడ్డలి)తో విచక్షణా రహితంగా దాడి చేయడంతో విమానం అసాధారణ స్థాయిలో అదుపు తప్పినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా విశ్లేషణలో తేలింది. ఒక దశలో దాదాపునిటారుగా విమానం భూమి దిశగా దూసుకొచ్చినట్లు తేలింది. ఆ తర్వాత విమానం తిరిగి అదుపులోకి వచ్చినా, భౌతికంగా దెబ్బతినడంతో ల్యాండింగ్ సవాలుగా మారిందని అమెరికా మీడియాసంస్థ ఓ కథనంలో వెల్లడించింది.

దాదాపు శబ్ద వేగాన్ని అందుకుని: ఫ్లైదుబాయ్ 'ఎఫ్‌జడ్ 1073'.. బోయింగ్ 737 మ్యాక్స్ శ్రేణికి చెందిన భారీ విమానం. ఇది అత్యధికంగా మ్యాక్ 0.82 వేగాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఇంతకు మించిన వేగంతో ప్రయాణిస్తే విమానం భౌతికంగా దెబ్బతినే ప్రమాదం పొంది ఉంది. ఈ విమానం దాడి సమయంలో.. 0.9 మ్యాక్ వేగంతో (దాదాపు 1 మ్యాక్ అంటే శబ్ద వేగానికి సమానంగా) భూమి దిశగా రావడం మొదలుపెట్టిందని 'ఫ్లైట్ రాడార్24' డేటా వెల్లడించింది. 92 సెకన్లలో 17,000 ఎత్తు తగ్గి.. విమానం కిందకు పడిపోయే సమయంలో కొన్ని రెట్ల జీఫోర్స్ (గురుత్వాకర్షణ శక్తి)కి లోనైంది. ఫలితంగా విమానం దిశను మార్చుకునేందుకు వినియోగించే రడ్డర్ దెబ్బతింది. విమానం ముక్కుభాగం సాధారణంగా ల్యాండింగ్ సమయంలో 3 డిగ్రీల కోణంలో కిందకు దిగుతుంది. కానీ, ఫ్లైదుబాయ్ 'ఎఫ్‌జడ్ 1073' మాత్రం అక్టోబరు 1న 39 డిగ్రీల కోణంలో భూమి దిశగా దూసుకెళ్లింది. కేవలం 92 సెకన్లలో 17,000 అడుగుల కిందకు పడిపోయింది. ఆ సమయంలో విమానం బాడీపై సాధారణ జీఫోర్స్ కంటే మూడు రెట్లు అదనంగా పడింది. సాధారణంగా 737 మ్యాక్స్ రకం విమానం 2.5 పాజిటివ్ జీఫోర్స్ మాత్రమే అత్యధికంగా తట్టుకోగలదు. ఏ కమర్షియల్ ఫ్లైట్ అయినా ఇంతే. విమానంలో ఉన్న డెడ్‌హెడ్ పైలట్స్ (విధులు ముగించుకొని.. లేదా వేరే చోట్ల విధులకు వెళుతున్నవారు) కంట్రోల్స్‌ను అదుపు చేసినా దాని తోక వద్ద రడ్డర్ దెబ్బతింది. వీరి సౌదీలోని తబుక్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌కు వెళుతున్న సమయంలో కూడా హఠాత్తుగా 500 అడుగుల ఎత్తు తగ్గిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఈ విమానం సౌదీలోనే ఉండిపోయింది. ఇక నిపుణులు మాత్రం దీని ఎయిర్ ఫ్రేమ్ సహా అన్ని భాగాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే మళ్లీ వాడొచ్చా లేదా అన్నది నిర్ధారిస్తారు.

సంక్షిప్త వార్తలు

మచ్చర్‌కు ఇజ్రాయెల్ ప్రధాని అరుదైన ఆహ్వానం

టెల్ అవీవ్, అక్టోబరు 4: ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రశంసలు కురిపించారు. స్మిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన నెతన్యాహూ ఇజ్రాయిల్ స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ గౌరవం సాధారణంగా ఇజ్రాయిల్ పౌరులకు మాత్రమే దక్కుతుందని, అయి తే మచ్చర్ విషయంలో ఇజ్రాయిల్ ప్రజలంతా ఆయనను తమవా డిగా స్వీకరించారని అన్నారు. తాను ఎలాంటి దాడిని తట్టుకుని విమానాన్ని రక్షించాననే విషయాన్ని మచ్చర్ నెతన్యాహూకు వెల్లడించారు. మచ్చర్ చెప్పిన వివరాలు విన్న నెతన్యాహూ ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. మచ్చర్‌కు తన భార్య తరఫున నెతన్యాహూ శుభాకాంక్షలు తెలిపారు.

ఇరాన్ దౌత్యవేత్తలు అమెరికా విడిచి వెళ్లిపోవాలి

వాషింగ్టన్, అక్టోబరు 4: ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల కోసం అమెరికాకు వెళ్లిన ఇద్దరు ఇరాన్ దౌత్యవేత్తల్ని ఆ దేశం బహిష్కరించింది. సర్వసభ్య సమావేశాలుముగిసిన తర్వాత అమెరికా విడిచి వెళ్లిపోవాలని అమెరికా విదేశాంగశాఖ వారిని ఆదేశించింది. ఈ ఆదేశాలను ధిక్కరించిన కారణంగా ఇద్దరు దౌత్యవేత్తలను ట్రంప్‌సర్కార్ బహిష్కరించింది. ఒక దౌత్యవేత్త శుక్రవారం అమెరికా విడిచి వెళ్లగా, మరొకరు శనివారం బయటకు వెళ్లినట్లు అమెరికా అధికారి తెలిపారు.

పాక్ మళ్లీ అక్రమ చొరబాట్లు:ఇద్దరు కాల్చివేత



న్యూఢిల్లీ, అక్టోబరు 4: సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్నఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు.

ప్రపంచం ప్రశంసిస్తుంటే కాంగ్రెస్ మౌనం దేనికి?: బిజెపి

న్యూఢిల్లీ, అక్టోబరు 4: ఫ్లైదుబాయ్ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటన దేశంలో రాజకీయ వేడిని రగిల్చింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్‌లపై బీజేపీ విరుచుకుపడుతోంది. స్మిత్ సాహసాన్ని ప్రపంచమంతా కొనియాడుతున్నా, కాంగ్రెస్ నేతలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నిస్తోంది. బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ఇదే విషయంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. గతంలో జాకీర్ నాయక్, అఫ్జల్ గురు, బుర్హాన్ వానీ, యాకూబ్ మెమన్ వంటి వ్యక్తుల అంశాలపై కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేశారని, బాట్లాహౌజ్ ఎన్‌కౌంటర్‌పై కాంగ్రెస్ మాట్లాడిందని త్రివేది అన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాల్కు చేస్తోందని ఆరో పించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన నాయకత్వ మార్పులపై కూడా ఆయన విమర్శలు చేశారు. యూపీలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా బ్రహ్మణ వ్యక్తిని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముస్లిం నేతలను నియ మించడంపై త్రివేది ఈ విమర్శలు చేశారు. దీనికి ఉత్తర్ ప్రదేశ్ ప్రజలే సమాధానం చెబు తారని వ్యాఖ్యానించారు.

వేధింపులపై పోలీసులకు కొల్లాం యువతి ఫిర్యాదు

కొల్లాం, అక్టోబరు 4: వరకట్నం పేరుతో పెళ్లయిన వారం రోజుల నుంచే భర్త, అత్తమామల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీనిని తాళలేక కొల్లామ్‌లోని నీందకారా ప్రాంతానికి చెందిన అంజు అనే యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తమామ, భర్తపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఎఫ్ఐఆర్‌లో అంజు పేర్కొన్న విషయాలను బట్టి చూస్తే నాలుగు నెలల క్రితం అంజు నందులకు వివాహం జరిగింది. అయితే పెళ్లి అయిన వారం రోజుల నుంచే ఆమెపై అత్తింటి వేధింపులు స్టార్ట్ అయ్యాయి. అదనపు కట్నం కోసం తనను మానసిక, శారీరకంగా వేధింపులకు గురి చేసినట్లు అంజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

5-10Pg6exHMNWJQE.qxd:5-10Pg6exHMNWJQE.qxd 1/1/02 6:32 AM Page 1

సినీ పరిశ్రమకి సింగీతం దిక్సూచి:సిఎం

సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. సింగీతం శ్రీనివాసరావు మృతి అత్యంత బాధాకరమని సీఎం చంద్రబాబు అన్నారు. సినీ పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు దిక్సూచిగా మారారని కొనియాడారు. వెండితెరపై సింగీతం చేసిన ప్రయోగాలు ప్రేక్షకుల ఆదరణ పొందాయన్నారు. భౌతికంగా దూరమైనా సినీ ప్రేమికుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సింగీతం ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

సింగీతం కన్నుమూశారని తెలిసి విచారిస్తున్నా- పవన్ కల్యాణ్

సింగీతం శ్రీనివాసరావు కన్నుమూశారని తెలిసి విచారిస్తున్నానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు ఆయన విభిన్న చిత్రాలు అందించిన దర్శకుడు అని పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావు చేసిన ప్రయోగాలు, చూపిన సృజన ప్రేక్షకులను ఎంతగానో మెప్పించాయని అన్నారు. సింగీతం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు: లోకేశ్

ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల మంత్రి లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రయోగాత్మక చిత్రాలతో దశాబ్దాల పాటు సినీ ప్రేక్షకులను అలరించిన సింగీతం శ్రీనివాసరావు మరణం చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తన తాతయ్య ఎన్టీఆర్, బాలా మామయ్యతో కలిసి పనిచేశారని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. బాలా మామయ్య ఖిఆదిత్య 369 భైరవద్వీపంఖి చిత్రాలకు దర్శకత్వం వహించారని లోకేశ్ అన్నారు.

విమర్శకుల ప్రశంసలు పొందారు మంత్రి కందుల దుర్గేశ్‌దిగ్భ్రాంతి

సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విభిన్న కథాంశాలతో చిత్రాలు తీసి విమర్శకుల ప్రశంసలు పొందారని కొనియాడారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్రవేసిన దిగ్గజ దర్శకుడు మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఉహాజనిత అంశాలు కథలుగా తీసుకుని ఆయన తీసిన చిత్రాలు అద్భుతమన్నారు. ఆయన చలనచిత్రాల్లో అయిదు తరాలతో చిత్రాలు నిర్మించి.

కాణిపాకంలో ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

కాణిపాకం, అక్టోబరు 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో 21 రోజులు పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో గత నెల 14 నుండి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఈమేరకు గత నెల 15న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమైన నవ రాత్రి బ్రహ్మోత్సవాలు 23న జరిగిన ధ్వజా వరోహణం, వడాయత్తుఉత్సవం, ఏకాంతసేవతో ముగిశాయి. అదేవిధంగా 24న అధికార నందివాహనసేవతో ప్రారంభమైన ప్రత్యేక ఉత్సవాలు ఆదివారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఈఉత్సవాలను 21 రోజులుపాటు అత్యం ్త వైభవోపేతంగా నిర్వహించడంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ మణినాయుడు, సభ్యులు, ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు సఫలీకృతులయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉభయదారులు పోటీలుపడి ఉత్సవాలను నిర్వహించడంతో వైవిధ్యభరితంగా ఉత్సవాలు సాగాయి. అలాగే ఉత్సవాల సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో సంప్రదాయమైన రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆహుతులను రంజింపజేశారు. రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ కాణిపాకం సందర్శనార్థం వచ్చే భక్తులకు 21 రోజులుపాటు దేవస్థానం ఆధ్వ ర్యంలోని నితాన్నదాన పథకం ఉచితభోజన వసతి కల్పించారు. ఈకార్యక్రమానికి భక్తులనుండి అనూహ్య స్పందన లభించింది. ఇదిలావుండగా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాలు, సూచనలతో చితూరు డీఎస్పీ వెంకట రమణ, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నా యుడుల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు ప్రణాళికలతో చిన్న చిన్న అవాంఛనీయ సంఘటనలు సైతం కూడా జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవడంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ముఖ్యంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ముందు నుండి ముగిసే వరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కు మార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు సూచనలు చేయడంతో ఉత్సవాలు ముగిశాయి.

గణేష్ దీక్ష ఇరుముడులు సమర్పణ

గణేష్‌దీక్ష చేపట్టిన భక్తులు ఆదివారం కాణిపాకంలో ఇరుముడులను సమర్పించారు. కాణిపాకం దేవస్థానంలో గత కొన్నేళ్ళుగా గణేష్‌దీక్షా మాల ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈమేరకు ఆలయ పరిసర గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా గణేష్‌దీక్ష మాలధారణ చేపట్టిన భక్తులు బ్రహ్మోత్సవాల చివరి రోజుకాణిపాకం చేరుకుని స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది గణేష్ దీక్ష చేపట్టిన భక్తులు దీక్ష పూర్తి చేసు కుని కాణి పాకం చేరుకుని ఆలయంలో స్వామి వారికి ఇరు ముడులను సమర్పించారు. వీరు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం ఏర్పాటుచే సిన గణేషదీక్షా మందిరంలో ఇరుముడు లను సమర్పించారు. వారికి ఆలయం వద్ద ఆలయ అధి కారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పా ట్లు చేశారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్ర బాబు, టెంపుల్ సూపరెండెంట్‌లు వా సు,కోదండ పాణి,తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ 25 ఏళ్ల సుపరిపాలనకు కృతజ్ఞత

- తిరుపతిలో ఆకట్టుకున్న మోదీ రంగవల్లి

తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశానికి అందిస్తున్న 25 సంవత్సరాల సుపరిపాలన నిరంతర సేవలకు తిరుపతి జిల్లా బిజెపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని ఇందిరా మైదానంలో మోదీ చిత్రంతో భారీ రంగవల్లి (ముగ్గు) కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ పాతికేళ్ళుగా ఎలాంటి సెలవు తీసుకోకుండా దేశం కోసం నిరాఘాటంగా శ్రమిస్తున్న నరేంద్ర మోదీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. అసాధ్యం అనుకున్న ఎన్నో పనులను మోదీ ప్రభుత్వం సుసాధ్యం చేసిందని ఆయన కొనియాడారు. పేద మహిళలు బ్యాంకింగ్ సేవలు పొందలేరన్న అపోహలను పటాపంచలు చేస్తూ జన్ ధన్ ఖాతాల ద్వారా కోట్లాది మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. ఒకప్పుడు ధనికులకే పరిమితమైన ఇంటర్నెట్‌ను అందరికీ అందు బాటులోకి తెచ్చి, నేడు చిన్న కూరగాయల వ్యాపా రి మొదలుకొని యాచకుల వరకు యూపిఐ ద్వా రా నగదు రహిత లావాదేవీలు చేసే స్థాయికి దేశం చేరుకుందని గుర్తుచేశారు. ఆర్టికల్ 370 రద్దు, రక్షణ రంగంలో

ఆయుధాల తయారీ మరి యు ఎగుమతుల్లో స్వయం సమృద్ధి సాధించడం మోదీ దార్శనికతకు నిదర్శనమన్నారు. విపత్కర కరోనా సమయంలో స్వదేశీ పరిజ్ఞానంతో కోవాక్సిన్, కోవిషీల్డ్ టీకాలను తయారుచేయించి దేశ ప్రజలందరికీ ఉచితంగా ప్రాణదానం చేయడమే కాకుండా, ప్రపంచంలోని అనేక పేద మరియు ఇతర దేశాలకు టీకాలను అందజేసి భారతదేశ ఔన్నత్యాన్ని చాటారని శ్రీనివాస్ ప్రశంసించారు. - చిరుధాన్యాలతో భరతమాత, మోదీచిత్రపటం:ఈ కార్యక్రమంలో మహిళలు వేసిన రంగవల్లి అందరినీ విశేషంగా ఆకర్షించింది. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా, అంతరించిపోతున్న పక్షులకు ఆహారంగా ఉపయోగపడేలా నవధాన్యాలు, చిరుధాన్యాలను ఉపయోగించి భరతమాత నరేంద్ర మోదీ చిత్రపటాలతో ఈ ముగ్గును తీర్చిదిద్దారు. పర్యావరణ హితంగా, ఒక బృహత్తర ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన మహిళా నాయకులు ప్రశాంతి రాజు, పుష్పలత, తేజోవతి, అనూష, అనిత,లక్ష్మి, కవిత,తదితరులకు సామంచి శ్రీనివాస్ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగురాలిపై అఘాయిత్యం

నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 4, ప్రభాతవార్త : మానసిక దివ్యాంగురాలు అయిన ఓ మైనర్ బాలికపై ఒక దుండగుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై వేదయపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యోతి నగర్ న్యూ హోప్ చర్చి ప్రాంతంలో ఒక అమానుష ఘటన చోటుచేసుకుంది. మానసిక దివ్యాంగురాలైన 13 ఏళ్ల బాలికపై జాషువా అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులైన సాతాను శేషమ్మ గత కొంతకాలంగా నెల్లూరు టౌన్ జ్యోతినగర్‌లోని న్యూ హోప్ చర్చిలో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే జీవిస్తున్నారు. ఆమె భర్త సుమారు మూడేళ్ల క్రితమే వారిని వదిలి వెళ్లిపోవడంతో, ఆమె తన 13 ఏళ్ల చిన్న కూతురు కలిసి అక్కడే ఉంటోంది. అదే చర్చిలో బాత్రూమ్‌లు కడిగే పని నిమిత్తం జాషువా అనే వ్యక్తి తరచూ అక్కడికి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో బాలిక తల్లి చర్చిని శుభ్రం చేసే పనిలో ఉండగా, జాషువా ఆ బాలికను ఒక గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనతో భయపడిన బాలిక ఆ గది నుండి ఏడుస్తున్న శబ్దం విని తల్లి వెళ్లి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తల్లి గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుండి పారిపోయేందుకు ప్రయత్నించగా, చుట్టుపక్కల వారితోపాటు చర్చి నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. గోడ దూకి పరారవుతున్న క్రమంలో నిందితుడు కిందపడి గాయపడ్డాడు. ఈ అమానుష సంఘటనపై ఆగ్రహించిన స్థానికులు అతనికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పదవి అంటే అధికారం కాదు.. బాధ్యత!

- ప్రతి పంచాయతీలో అభివృద్ధి పని చేసి.. మళ్లీ ఓట్లు అడుగుతాం: ఎమ్మెల్యే గౌతు శిరీష
- అప్పలరాజుకు సవాల్.. ఐదేళ్లలో మీ అభివృద్ధి, రెండేళ్లలో మా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

శ్రీకాకుళం, అక్టోబర్ 4 ప్రభాతవార్త : పదవి అంటే అధికారం, హోదా కాదని.. ప్రజలకు సేవ చేసే బాధ్యత అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని గొల్లసారథి, చిన్నదోకులపాడు, పల్లిసారథి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో, ప్రతి గ్రామంలో కనీసం ఒక్క అభివృద్ధి పని చేసి ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడుగుతామని ఆనాడే ప్రకటించినట్లు తెలిపారు.

చంద్రబాబే దిక్సూచి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమకు దిక్సూచి లాంటి వారని గౌతు శిరీష పేర్కొన్నారు. 76 ఏళ్ల వయసులోనూ ఆయన కష్టపడి పనిచేస్తున్న తీరును స్ఫూర్తిగా తీసుకుని తాము ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో జరగని పనులను రెండేళ్లలోనే చేపడుతూ పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకొచ్చామని పేర్కొన్నారు.

పోలవరం ఎందుకు పూర్తి చేయలేదు? గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే: పోలవరం వంటి జీవనాడి ప్రాజెక్టును పూర్తి చేయడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 2019, 2021, 2023లో పూర్తి చేస్తామని ప్రకటించినా ప్రాజెక్టు పూర్తికాలేదని విమర్శించారు.

వంశధార నీటిపై అప్పలరాజుకు సవాల్: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై గౌతు శిరీష తీవ్ర విమర్శలు చేశారు. మంత్రి పదవిలో ఉన్న కాలంలో వంశధార నీటిని ఈ ప్రాంతానికి తీసుకురావడానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన 12 రోజుల్లోనే వంశధార నీటిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చామని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన క్రెడిట్ విషయంలోనూ రాజకీయ విమర్శలు చేశారు. తాము చేస్తున్న పనులకు క్రెడిట్ తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

రూ.2 వేల కోట్ల అభివృద్ధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పలాస నియోజకవర్గ అభివృద్ధికి రూ.2 వేల కోట్లు తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా తాను గర్వపడుతున్నానని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మళ్లీ వారి వద్దకు ఓట్లు అడగడానికి వస్తానని చెప్పారు.

చర్చకు సిద్ధమా? : మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు ఎమ్మెల్యే గౌతు శిరీష సవాల్ విసిరారు. ఐదేళ్లలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో పల్లెల్లో చేసిన అభివృద్ధి పనులు.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, వాటి కోసం ఖర్చు చేసిన బడ్జెట్‌పై బహిరంగంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే మళ్లీ వారి వద్దకు ఓట్లు అడగడానికి వస్తామని స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి జెండా ఎగరవేయాలి

- పలువురు వైసీపీ నేతలు పిలుపు

ఒంగోలు, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రకరకాల హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశానికి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కూటమి పాలనలో చిన్నపాటి పనులు కూడా జరగడం లేదని, గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా అవినీతి తప్ప అభివృద్ధి, సంక్షేమం జాడలేదని ప్రజలు స్పష్టంగా చెప్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో

ప్రజలతో మాట్లాడితే ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కోల్పోయామని, ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో లేనప్పుడు పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక ఎన్నికలను బహిష్కరించి పారిపోయారని ఆయన పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అధికారం లేకపోయినా ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి అధికార పక్షానికి ధీటుగా సమాధానం చెప్పాలనే ఆలోచనే ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జగన్ 175 నియోజక వర్గాల నాయకులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారని ఆయన అన్నారు. ఎన్నికల సమయం రాగానే చంద్రబాబునాయుడు రకరకాల రాజకీయ విన్యాసాలు ప్రదర్శించడం అలవాటేనని దుయ్యబటారు. గత 28 నెలలుగా గుర్తుకు రాని పెన్షన్లు ఎన్నికలు రాగానే చంద్రబాబుకు గుర్తుకు వచ్చాయని ఎద్దేవ చేశారు. పెన్షన్లు పేరుతో జాబితాలు సేకరిస్తున్నారని, ప్రజలకు పెన్షన్లు వస్తాయో రావో దేవుడికే ఎరుక అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు వెళ్లకుండా నివారించేందుకే పెన్షన్ల ఆశచూపి చంద్రబాబు ఈ కుట్రకు తెరలేపారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు బీసీల కోసం జీవోల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని, ఎన్నికలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి బీసీలు గుర్తుకొస్తారని, వారిని మోసం చేయడానికే జీవోల పేరుతో కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన తీవ్ర స్థాయిలో తెరలేపారు. ఈ జీవోల పునరావృతం కోర్టులో రద్దు, చంద్రబాబు బీసీలకు 34శాతం రిజర్వేషన్ పెంచామంటూ రెండు జీవోలను విడుదల చేసి హడావుడి చేశారని ఆయన విమర్శించారు.

ఎన్టీఆర్ జిల్లా కాచవరం వద్ద కారు దగ్ధం

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా: ఇబ్రహీంపట్నం మండలం కాచవరం వద్ద జాతీయరహదారిపై కారు దగ్ధమైంది. ఈ కారు పట్టణం నుంచి కంచికచర్ల వైపు వెళ్తుండగా కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించి ప్రయాణికులు బిగ్గర, బిగ్గరగా కేకలు వేసుకుంటూ బయటకు వచ్చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఘట నాస్థ లికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంట లార్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కారు పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

టెక్కలి-ఇచ్ఛాపురం హైవే మరమ్మతులకు చర్యలు

శ్రీకాకుళం, అక్టోబర్ 4 ప్రభాతవార్త : ఇటీవల కురిసిన వర్షాలకు టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారి పలు ప్రాంతాల్లో ఇబ్బందికరంగా తయారైన పరిస్థితిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారిపై పెద్దఎత్తున గోతులు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి రహదారి పరిస్థితిని సమీక్షించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లోగా టెక్కలి-ఇచ్ఛాపురం జాతీయ రహదారిపై మరమ్మతు పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల ప్రయాణ సౌకర్యం, రహదారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మళ్లీ రాజుకున్న తిరువూరు ఎంఎల్ఎ, విజయవాడ ఎంపి మధ్య వివాదం

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్త ప్రతినిధి: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మధ్య వివాదం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికే అనేకమార్లు ఇరువురి మధ్య బహిరంగ విమర్శలు,ప్రతి విమర్శలు చోటు చేసుకున్నాయి. ఇరువురి మద్దతుదారులు గతంలో ధర్నాలకు దిగారు. ఈ క్రమంలో అధిష్టానం వారిని పిలిపించి మందలించిన పరిస్థితులున్నాయి. ఒక దశలో సీఎం చంద్రబాబు,టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొలికపూడిని నేరుగా మందలించిన పరిస్థితులున్నాయి. చిన్నికి సైతం అధిష్టానం నచ్చచెప్పింది. దాంతో గొడవ సర్దుమణిగింది. అయితే తాజాగా కొలికపూడి చేసిన పార్టీ నేతలపై చేసిన విమర్శలు చర్చకు కారణం అయ్యాయి. తిరువూరు(ఎస్సీ) నియోజకవర్గం విజయవాడ లోక్‌సభ పరిధిలో ఉండటం వల్ల స్థానిక ఆధిపత్యం, పార్టీ నియంత్రణపైనే ఈ ఘర్షణలు తీవ్రమవుతున్నాయి. 2024 ఎన్నికల్లో తిరువూరు ఎమ్మెల్యే టికెట్ కోసం కేశినేని చిన్ని రూ.5 కోట్లు తీసుకున్నారని చెప్పారు. తన ఖాతా నుంచి వివిధ వ్యక్తుల ద్వారా డబ్బు బదిలీ చేసినట్లు వివరాలు బయటపెట్టారు. చిన్ని దీన్ని తిరస్కరించారు. "మొన్నటి వరకు నన్ను దేవుడన్నారు.. ఇప్పుడు దెయ్యం ఎందుకయ్యానో" అని స్పందించారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఇద్దరినీ పిలిచి విచారించి నివేదిక సీఎం చంద్రబాబుకు అందించింది. గంపలగూడెం నెమలి శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో కళ్యాణోత్సవం సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించే విషయం లోను ఎంఎల్ఏ,ఎంపీల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరిగింది. ఈ ఘటనలో చిన్ని చేతినిలో పట్టువస్త్రాలు కొలికపూడి లాక్కొని స్వామివారికి అందజేసారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆపై మెప్మా ఎన్నికలు, స్థానిక పార్టీ నియామకాలు, ఇసుక, రేషన్ వంటి అంశాలపైనా ఇద్దరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగాయి. తాజాగా ఎమ్మెల్యే కొలికపూడి ఒక టీచర్ ను కొట్టారని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. దీంతో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నేతలపైనే ఘాటుగా స్పందించారు. కేశినేని చిన్నిని టార్గెట్ చేసారు. తనపై వస్తున్న అసత్య ఆరోపణలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని డైరెక్షన్‌లోని నేతలే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య గత రెండేళ్లుగా తిరువూరు నియోజకవర్గ అంతర్గత విషయాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బాలకోటయ్య రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసిన లేఖ సోషల్ మీడియాలో తిరుగుతోందని పేర్కొన్నారు. తనపై బాలకోటయ్య తన చేసిన ఆరోపణలు రుజువు చేయాలన్నారు. తాను తప్పుచేసే తలదించుకుని వెళ్తానన్నారు. ఆయన వెనుక ఎవ్వరున్నారనేది తెలియంది కాదన్నారు.

ముక్కంటీశుని ఆలయం: శివనామస్మరణతో పునీతం

- రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. వరుస సెలవులతో భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడశాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఆలయంలో అడుగుపెడితే భక్తి భావంతో తన్మయత్వం చెందుతున్నారు. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆదివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళ కళ లాడింది. ఒరెండు రోజులుగా భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే ఆన్‌లైన్‌కు భక్తులు అలవాటు పడుతున్నారు.

అనూహ్యంగా పెరిగిన రద్దీ:

వేసవి సెలవులు పూర్తి కావస్తుండగా రెండు రోజులుగా ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ఇఓ బికె

వెంకటేశు పర్యవేక్షించారు.

శివానందైక నిలయం జనంతో కిట కిట:

దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ బికె వెంకటేశులు స్వయంగా పర్యవేక్షించగా వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కడలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎటు చూసినా జనం జనం అన్నట్లు మారింది. ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్‌లో పరిశీలించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే జనం. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, వెంకటస్వామి, నాగభూషణం యాదవ్,పిఆర్ఓ రవి వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిబంధనలతో చిక్కులు:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఆలయంలో రోజుకొక నిబంధనలతో సతమతమౌతున్నారు. పిఆర్ఓ కార్యాలయం నుంచి కొందరు విఐపిల ముసుగులో అంతరాలయ దర్శనానికి తీసుకెళ్ళటంతో భక్తుల్లో అసహనం చోటు చేసుకుంది. దేవుని ముందు అందరూ సమానులే అంటారు. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో 'పలుకుబడికే'పెద్ద పీట అన్నట్లుమారింది. ఇక్కడ చట్టాలు కొందరికి చుట్టాలుగామారి కనకవర్షం కురిపిస్తుంది. దిశ దెశ నిర్దేశం లేని నిబంధనలతో స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద ఉన్న సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి కొత్త నిబంధనలు

విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో ఈ నియమాలు వర్తిస్తున్నాయి. జననం లేదా మరణం జరిగిన 21 రోజుల్లోపు నమోదు చేస్తే సర్టిఫికెట్ పూర్తిగా ఉచితంగా లభిస్తుంది. ఈ గడువులోపు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి ఆలస్య రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 21 రోజులు దాటితే ఆలస్య నమోదు నియమాలు వర్తిస్తాయి. 1 నుంచి 2 సంవత్సరాల లోపు ఆలస్యమైతే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ ఆదేశాలు అవసరం అవుతాయి. 2 సంవత్సరాలు దాటితే ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాలు తీసుకుని మాత్రమే జనన , మరణ ధృవీకరణ పత్రాలను నమోదు చేసుకోవచ్చు. జనన, మరణ సర్టిఫికెట్లు చాలా అవసరమైన పత్రాలు. పాఠశాలలో చేరిక, పాస్‌పోర్ట్, ఆధార్, బ్యాంక్ ఖాతా, వారసత్వ హక్కులు, ఉద్యోగాలు వంటి అనేక అవసరాలకు ఇవి తప్పనిసరిగా అవసరం అవుతాయి. ఆలస్యం చేస్తే అదనపు ఖర్చు, సమయం వృధా కావడమే కాకుండా న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కనుక జనన, మరణ ధృవీకరణ పత్రాలను తీసుకోవటంలో జాప్యం చేయకుండా 21 రోజులలోగా దరఖాస్తు చేసుకోవటం మంచిది. గతంలో కూడా జననం లేదా మరణం జరిగిన 21 రోజుల్లోపు నమోదు చేస్తే సాధారణంగా ఉచితంగానే ధృవీకరణ పత్రం ఇచ్చేవారు. ఆలస్యమైతే నిబంధనలు కాస్త గందరగోళంగా ఉండేవి. 21 రోజులు దాటి 30 రోజుల లోపు అయితే కొంత ఆలస్య రుసుము చెల్లించాల్సి వచ్చేది. ఒక నెల నుంచి ఒక సంవత్సరం లోపు ఆలస్యమైతే రిజిస్ట్రార్ లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశాలు అవసరమయ్యేవి. ఒక సంవత్సరం దాటితే ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లేదా జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలు తీసుకోవాల్సి వచ్చేది. చాలా చోట్ల స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం వల్ల ప్రజలు ఏ అధికారిని సంప్రదించాలో అర్థం కాక, అనవసరంగా తిరగాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో అదనపు రుసుములు, ఆలస్యం కూడా ఎదుర్కొనేవారు. ఇప్పుడు అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు మరింత స్పష్టంగా, ప్రజలకు అనుకూలంగా ఉన్నాయి. 21 రోజుల్లోగా నమోదు చేస్తే పూర్తిగా ఉచితం అని స్పష్టంగా నిర్దేశించారు. దీనివల్ల ప్రజలు త్వరగా నమోదు చేసుకునే అవకాశం పెరుగుతుంది.

5-10Pg7exHMNWJQE.qxd:5-10Pg7exHMNWJQE.qxd 1/1/02 6:40 AM Page 1

ఎస్వీ వైద్యకళాశాలలో ముగ్గురు వైద్యులపై వేటు!

తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: వైద్యహబ్ గా తీర్చిదిద్దుతున్న తిరుపతి ఎస్వీ వైద్యకళాశాల పరిధిలో ముగ్గురు వైద్యులపై ఉన్నతాధికారులు వేటు వేశారు.సుదీర్ఘకాలంగా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.రోజువారీగా విధులకు హాజరు కాకపోవడంతో ముగ్గురు వైద్యులను వైద్య ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. తిరుపతి లోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి గైనకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యమున,రుయా ఆస్పత్రి మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతాప్,పాథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దివ్యసాయిపై కూడా వేటు వేశారు. ఇదే నిర్లక్ష్యంపై మరికొందరు వైద్యులపై త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుసోనతంది.

దీర్ఘకాలంగా అనధికారికంగా విధులకు గైర్హాజరైన వారిపై అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతుండటం సంచలనంగా మారింది. రాయలసీమకే తలమానికంగా ఉన్న తిరుపతిని వైద్యహబ్‌గా తీర్చిదిద్దే ప్రక్రియలో వైద్యుల పని తీరుపై తనిఖీలు కొనసాగుతున్నాయి.

తిరుమలలో తప్పిపోయిన కర్ణాటక భక్తుడు

తిరుమల,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి దర్శనానికి వచ్చి కర్నాటక భక్తుడు తిరుమలలో తప్పిపోయాడు. కర్ణాటక మాండ్య జిల్లానాగ మంగళ హిదువా గ్రామానికి చెందిన శంకరే గౌడ(58) తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. ఆయన కుమారుడు ఎస్.సంజయ్ గత నెల 20వతేదీ శంకరే గౌడ తన తొమ్మిది మంది బంధువులతో కలిసి తిరుమలకు వచ్చారు.ఆ రోజు ఉదయం శ్రీవారి దర్శనానికి వెళ్లి దర్శనం పూర్తయిన తరువాత మధ్యాహ్నం ఆలయం నుండి బయటకు వస్తున్న సమయంలో శంకరే గౌడ తన వెంట వచ్చిన బంధువుల నుండి విడిపోయి కనిపించకుండా పోయాడు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. శంకరే గౌడ ఆచూకీ తెలిసిన వారు 9440796771,9440796769,0877 2289027 నంబర్లకు తెలియజేయాలని తిరుమల 1టౌన్ పోలీసులు కోరారు.

ట్రావెల్స్ బస్సులో అగ్నిప్రమాదం

- ప్రయాణికులు సకాలంలో స్పందించడంతో తప్పిన పెను ప్రమాదం

గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి : కాళహస్తి నుంచి విజయవాడకు వెళ్తున్న న్యూగో ట్రావెల్స్ బస్సులో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఏపీ 51 ఏఎల్ 0091 నంబర్ గల బస్సు గుంటూరు ఆటోనగర్ మీదుగా విజయవాడ హైవే వైపు వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో బస్సులో 27 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. గుంటూరులో దిగాల్సిన ప్రయాణికులు దిగిన అనంతరం మిగిలిన వారితో బస్సు విజయవాడకు బయలుదేరింది. గుంటూరు దాటిన కొద్దిసేపటికే మంటలు కనిపించడంతో ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమై వెంటనే బస్సు నుంచి బయటకు వచ్చారు. దీంతో ప్రాణ నష్టం తప్పింది. అయితే మంటలకు టైర్ పగలడమే కారణమని చెబు తున్నప్పటికీ, బస్సులోని లగేజీ ప్రాంతంలో అగ్నికి సంబంధించిన వస్తువులు ఉన్నాయన్న ఆరోపణలతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పెదకాకాని పోలీస్ స్టేషన్ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిరుపతిలో యాత్రికుల వసతి పేరుతో వ్యభిచారం

- మేనేజర్‌తో సహా ముగ్గురు విటుల అరెస్ట్

తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: యాత్రా స్థలం తిరుపతినగరంలో యాత్రికులకు వసతి కల్పించే పేరుతో కొందరు నిర్వాహకులు వేశ్యా వృత్తి నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చాలావరకు పోలీసులకు అందిన ఫిర్యాదులతో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలతో జిల్లాలో అసాంఘిక చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.తిరుపతి నగరంలోని శివజ్యోతి నగర్‌లోని శ్రీనివాస గెస్ట్ హౌస్‌లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. గెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేపట్టగా మొదటి అంతస్తులోని మూడు గదుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న ముగ్గురు పురుషులు, నలుగురు మహిళలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో శ్రీనివాస గెస్ట్ హౌస్ మేనేజర్ సంకర్ జీవితం (37)తో బాటు తిరుపతికి చెందిన చింత కదిరయ్య (35), సుంకర లక్ష్మీ మ్రపతి (29), మాదిరి హరి (31) లను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల విచారణలో గెస్ట్ హౌస్ మేనేజర్ వివిధ ప్రాంతాల నుండి మహిళలను తీసుకువచ్చి గెస్ట్ హౌస్‌లో వ్యభిచార కార్యకలాపాలకు అవకాశం కల్పిస్తూ, విటుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. 28వేల రూపాయలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార కార్యకలాపాలకు వేదికగా ఉపయోగించిన శ్రీనివాస రెసిడెన్సీ/గెస్ట్ హౌస్‌ను మూసివేయడానికి సంబంధిత నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టేందుకు తిరుపతి ఆర్డిఒకి పోలీసులు సిపార్సు చేశారు.

రేణిగుంటలో మాయం... మహబూబ్ నగర్‌లో ప్రత్యక్షం

రేణిగుంట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: రేణిగుంట గుంట కట్ట వద్ద నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ ఎట్టకేలకు తెలంగాణలోని మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో లభించింది. రేణిగుంట అర్బన్ పోలీసులు ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలింపు చేపట్టి 24 గంటల్లోనే బాలురను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్లలు క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. తిరుపతి జిల్లా రేణిగుంట బుగ్గ వీధికి చెందిన జి. పాండురంగ (12), పి. గణేష్ రెడ్డి (15) శుక్రవారం ఆడుకోవడానికి అని రేణిగుంట గుంట కట్ట వద్దకు వెళ్లి కనిపించకుండా పోయారు. పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే రేణిగుంట పోలీసులను ఆశ్రయించారు.విషయం తెలిసిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు తక్షణం విచారణ చేపట్టడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ఇతర ప్రాంతాల్లోనూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.పోలీసులు చాకచక్యంతో సాగించిన గాలింపు చర్యలకు ఫలితం దక్కింది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు బాలురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాత్రికి రాత్రే మహబూబ్‌నగర్‌కు చేరుకుని బాలురను సురక్షితంగా తీసుకొచ్చారు.పిల్లలు కనిపించకుండా పోయిన వెంటనే వేగంగా స్పందించి, సాంకేతిక పరిజ్ఞానంతో గాలింపును చర్యలు చేపట్టి 24 గంటల్లోనే పిల్లల ఆచూకీ కనుగొనడం తో పోలీసులు అందరి మన్ననలు అందుకుంటున్నారు. బాలురను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను తిరుపతి పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుండి 25లక్షలు రూపాయులు విలువైన 24 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి సారించి సిఐ పి.రామకృష్ణ దర్యాప్తు చేపట్టారు. తిరుపతి డిఎస్పీ ఎం. భక్తవత్సలం ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలుతో ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 24 చోరీ ద్విచక్ర వాహనాలు రికవరీ చేశారు.నేరాలకు పాల్పడిన ఆరెద్దుల వినోద్ కుమార్ (32), చెర్లోపల్లి గోవిందరాజులు (34), గోవిందస్వామి మురళి (30) లను అరెస్ట్ చేశారు. ఆరెద్దుల వినోద్ కుమార్ పై 21 కేసులు, చెర్లోపల్లి గోవిందరాజులు పై 14 కేసులు, గోవిందస్వామి మురళి పై 17 కేసులు నమోదై ఉన్నాయి, వీరి పై చిత్తూరు జిల్లాలో కూడా పలు కేసులు నమోదైనట్లు అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేసి, వాహనాలను తప్పనిసరిగా లాక్ చేయాలని పోలీసులు సూచించారు. దర్యాప్తులో విశేష ప్రతిభ కనబరిచిన , చోరీకి గురైన ద్విచక్ర వాహనాల రికవరీలో తిరుపతి సిఐ రామకృష్ణ, ఎస్ఐలు హేమాద్రి ,సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్లు రవి, చరణ్, నాగార్జున, తిలక్, జ్ఞానేశ్వర్, గిరి, శాంతి లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

విశ్వ విజేతలను కలవడం గర్వంగా ఉంది

విజయనగరం, అక్టోబర్ 4, ప్రభాతవార్త: దేశ క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడే విధంగా 2025 విశ్వ విజేతలుగా నిలిచిన అంధుల మహిళా క్రికెటర్లను కలవటం చాలా గర్వంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళ పాలెం గురుదేవ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన 2025 అంధుల మహిళా క్రికెటర్లను ప్రతి ఒక్కరిని పేరు పేరునా పలకరిస్తూ పరిచయం చేసుకుని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టుదల ఉంటే అంగవైకల్యం అడ్డు కాదని ప్రపంచానికి చాటి చెప్పిన అంధుల మహిళా క్రికెటర్లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారతదేశంలోని 12 రాష్ట్రాల నుండి ఎంపిక కాబడిన ఇండియన్ అంధుల మహిళ క్రికెట్ సభ్యుల ఒక్కొక్కరి జీవిత గాధలు తెలుసుకుంటే వారి నుంచి స్ఫూర్తి పొంది ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జట్టులో తెలుగు రాష్ట్రాలకు చెందిన కెప్టెన్ దీపిక, కరుణ కుమారి ఉండటం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. అలాగే మన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర ప్రాంత బిడ్డ కరుణకుమారి కావటం, ఫైనల్ లో అద్భుతమైన ప్రదర్శనతో జట్టు విజయానికి కీలకంగా నిలవటం మరింత గర్వకారణంగా ఉందని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉరిమే ఉత్సాహంతో మరింతగా క్రీడల్లో రాణించాలని, ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే గురుదేవా ట్రస్ట్ వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అమూల్యమని అన్నారు. మూడు లక్షల మందికి పైగా విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల (ప్రోస్టెటిక్స్) అందజేసి దేశంలోనే నాలుగో స్థానంలో ఉండటం ఈ ట్రస్ట్ మన విజయనగరం జిల్లాలో ఉండటం మరింత గర్వకారణం అన్నారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు కావలసిన అనేక రకాల సదుపాయాలు కల్పించడంతో పాటు వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, కృత్రిమ అవయవాలు, వాకర్లు మరియు చేతి కర్రలు సంస్థ ద్వారా అందించడం వారి సేవా నిరతని తెలియజేస్తుందన్నారు. అలాగే గురుదేవ ట్రస్ట్ ద్వారా క్యాన్సర్ వైద్య సేవలు అందించడం కూడా శుభపరిణామం అన్నారు. విశ్వ విజేతలను తీసుకురావడంతో పాటు వారు గెలుచుకున్న ప్రపంచ కప్ ను సైతం నిర్వాహకులతో మాట్లాడి తీసుకురావడం గురుదేవ ట్రస్ట్ యొక్క విధానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రపంచ కప్ మహిళ అంధుల విజేతలకు హిందుస్థాన్ షిప్ యార్డ్ భాగస్వామ్యం చాలా అద్భుతమనీ, జట్టులోని 16 మందికి ఒక్కరికి 50 వేల రూపాయల నగదు ప్రోత్సాహం అందించడం పట్ల హిందుస్థాన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల చైర్మన్ గుడిపూడి నారాయణస్వామి, హిందుస్థాన్ షిప్ యార్డ్ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్ కిరణ్, ఇండియన్ బ్లైండ్ ఉమెన్ క్రికెట్ చైర్మన్ అజయ్ రెడ్డి, గురుదేవా ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు, డాక్టర్ ఫణీంద్ర, ట్రస్ట్ మెంబర్ బి ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వైకాపాలో కొనసాగుతున్న రాజీనామాల పర్వం

విజయనగరం, అక్టోబర్ 4, ప్రభాత వార్త: చీపురుపల్లి నియోజకవర్గ వైకాపాలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. వైకాపాకి చిన్న శ్రీను దూరమవడం ఆపై ఆయన అనుచరగణం రోజుకొకరు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తుండటంతో ఈ నియోజకవర్గంలో చిన్న శ్రీను పట్టు బిగిస్తున్నారనేది తేటతెల్లమవుతోంది. కాగా శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ పట్టు సడలే పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్ సీపీ కి బలమైన నాయకత్వం, పట్టున్న నాయకులు బొత్స సత్యనారాయణ వెంట ఉన్నారు. జిల్లా లో మరేఇతర నియోజకవర్గ ములో లేని క్యాడర్ చీపురుపల్లిలో సత్తిబాబు కి ఉందనేది వాస్తవం. ఆయన ఏ పోరాటానికి పిలుపు ఇచ్చినా చీపురుపల్లి నుండే జనం అధిక సంఖ్యలో పాల్గొని పరిస్థితి. ఈ దశలో మేనల్లుడు పార్టీ ఫిరాయింపు నేపథ్యం లో బొత్స సత్యనారాయణకే ఎసరు పెట్టే విధం గా ఆయన క్యాడర్‌నే చిన్న శ్రీను దూరం చేసే పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో బొత్సకు చీపురుపల్లిలో ఎదురుదెబ్బలు తప్పవని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. బలమైన పునాదు లు నిర్మించుకున్న సత్తిబాబుకి చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రతీ పల్లె నుండి క్యాడర్‌ని చిన్న శ్రీను తనవైపు తిప్పుకొనే పరిస్థితులు బొత్సకు మైనస్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

వైభవంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

ప్రత్యేక రైలు యాత్ర ప్రారంభం

ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 4, ప్రభాతవార్త : సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ప్రత్యేక రైలు యాత్ర వైభవంగా జరిగింది. పవిత్ర ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీ సోమనాథ్ దేవాలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు (1000 సంవత్సరాలు) పూర్తయిన సందర్భంగా, అలాగే ఆలయ పునర్నిర్మాణం (1951) జరిగి 75 ఏళ్లు పూర్తయిన చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏడాది పాటు (జనవరి 2026 నుండి జనవరి 2027 వరకు) సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ రైలును ఆది వారం విజయవాడ రైల్వేస్టేషన్లో 1వ నంబర్‌ప్లాట్‌ఫాంపై ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, దేవాదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్. మల్లికార్జునరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రైలు యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రముఖ దేవాలయాల నుంచి 1,060 మంది భక్తులు తరలివెళ్లారు. జాతి సమగ్రతను పరిరక్షించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి దేవాదాయ, సాంస్కృతిక, రైల్వే శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

- కళాప్రదర్శనకు తరలివెళ్లిన కళాకారులు:

భక్తులతో పాటుగా రాష్ట్ర సంస్కృతి, కళారూపాలను అక్కడ ప్రదర్శించేందుకు 100 మందితో కూడిన సాంస్కృతిక బృందం (కళాకారులు) కూడా ఈ యాత్రలో పాలుపంచుకుంటున్నారు. రైలు ప్రయాణంలో భక్తులకు భోజనం, వసతి, తాగునీరు, వైద్య సదుపాయాలు నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారుల బృందం వెంట వెళ్తోంది. ఈ కార్యక్రమంలో దేవాదాయ, సాంస్కృతిక శాఖల అధికారులు, రైల్వే అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- ఇంద్రకీలాద్రిపై ఆగమోక్తంగా సూర్యోపాసన:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం సూర్యోపాసన సేవ అత్యంత భక్తి శ్రద్ధలతో ఆగమపద్ధతుల ప్రకారం నిర్వహించ బడింది. లోక కల్యాణార్థం మరియు భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ పాల్గొని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కనక దుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- ఘాట్ రోడ్డు భద్రతా చర్యలపై కమిషనర్ కీలక ఆదేశాలు:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఘాట్ రోడ్డు మార్గాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించి, చేపడుతున్న రక్షణ చర్యలను సమీక్షించారు.

టోల్‌ప్లాజా వద్ద టిప్పర్ లారీడ్రైవర్ల దుశ్చర్య

గన్నవరం, అక్టోబర్ 4, ప్రభాతవార్త : టోల్‌గేట్ ఫీజులు చెల్లించకుండా టిప్పర్ డ్రైవర్‌లు బారియర్‌లను గుద్దుకుంటూ వెళ్ళిపోయిన ఘటన విజయవాడ పశ్చిమ బైపాస్‌లో కృష్ణాజిల్లా గన్నవరం మండలం వెదురుపావులూరు టోల్‌గేట్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ అనుచరుడు సూరపనేని జయకృష్ణకు చెందిన టిప్పర్ లారీలు కొండపల్లి నుండి దెందులూరు నియోజకవర్గంలోని చల్లచింతల పూడిలో రహదారుల నిర్మాణానికి ఫ్లైయాష్ తరలిస్తున్నాయి. గత నెల రోజులుగా రెండులారీలు టిప్పర్‌లు తిరుగుతుండగా ఈటోల్ ప్లాజా వద్ద రోజుకు రెండు టిప్పర్‌లకు అనధికారికంగా టోల్‌ఫీజు మినహాయింపు ఇచ్చారు. ఆదివారం మొత్తం 18 టిప్పర్‌లు ఫ్లైయాష్ కోసం గన్నవరం వైపు నుండి కొండపల్లికి వెళ్ళే క్రమంలో వెదురుపావులూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నాయి. టోల్‌ఫీజు చెల్లించాలని టోల్‌ప్లాజా సిబ్బంది కోరగా తాము చెల్లించేదిలేదని టిప్పర్ డ్రైవర్‌లు తెగేసి చెప్పారు. టోల్‌ఫీజు చెల్లించకపోతే కుదరదని టోల్‌ప్లాజా సిబ్బంది స్పష్టం చేయటంతో టోల్‌గేట్ వద్ద ఉన్న ఆరులేన్లలోనూ రహదారికి అడ్డంగా టిప్పర్‌లను నిలిపివేసారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న టిప్పర్‌లను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసారు. గంట సమయం తరువాత ఏమైందోఏమోగాని అకస్మాత్తుగా 10 టిప్పర్‌లు టోల్‌ప్లాజా బారియర్స్‌ను గుద్దుకుంటూ కొండపల్లి వెళ్ళిపోయాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా గన్నవరం సిఐ శివప్రసాద్ తన సిబ్బందితో టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని టిప్పర్ డ్రైవర్‌లను మందలించారు. ఒక డ్రైవర్ సిఐపై దురుసుగా ప్రవర్తించటంతో అతనిని అదుపులోకి తీసుకుని గన్నవరం స్టేషన్‌కు తరలించారు. కొన్ని టిప్పర్‌లకు సరైన పత్రాలు లేకపోవటంతో వాటిపై పోలీసులు కేసులు నమోదు చేసారు. మిగిలిన టిప్పర్‌లు టోల్‌ప్లాజా వద్దే ఉండగా వాటికి గన్నవరం పోలీసులు కాపలా కాస్తున్నారు. కాగా టిప్పర్‌డ్రైవర్‌ల ప్రవర్తన దారుణంగా ఉంది. ఎవరినీ లెక్క చేకుండా పోలీసుల్ని సైతం చిన్నచూపు చూస్తు ఇష్టారీతిగా మాట్లాడుతూ అంతా మాఇష్టం అన్నట్లు ప్రవర్తించారు. టిప్పర్ డ్రైవర్‌ల ప్రవర్తన చూసిన వాహన యజమానులు నివ్వెరపోయారు. ఇటువంటి సంఘటనలు ప్రభుత్వానికి చెడ్డపేరుతెచ్చేలా ఉన్నాయి.

వైసిపి యువనాయకుడు మహేశ్వర్‌రెడ్డిపై దాడి

పామిడి, అక్టోబర్ 04 ప్రభాతవార: పట్టణానికి చెందిన 13వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ యువ నాయకుడు మహేశ్వర్‌రెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డ సంఘటన ఆదివారం రాత్రి ఎద్దులపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. మహేశ్వర్‌రెడ్డి తన ద్విచక్రవాహనంలో వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డిని ఆయన ఫర్టిలైజర్ షాపు నుండి పి.కొత్తపల్లి రోడ్డులోని ఇంటి వద్ద వదిలి వస్తుండగా సంఘటన జరగటం పట్టణంలో చర్చానీయాంశంగా మారింది. వైట్ స్కార్పియోతో ఢీ కొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు మహేశ్వర్‌రెడ్డి కింద పడిన వెంటనే కట్టెలతో దాడి చేయటంతో ఆయన కుడిచేయి విరగటం కాళ్ళకు బలమైన గాయాలవ్వటంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బిసిలకు 34 శాతం రిజర్వేషన్ పక్కా: కొండపల్లి

విజయనగరం. అక్టోబర్ 4 ప్రభాతవార్త: బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్‌పి, ప్రవాసాంధ్రుల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీసీ సామాజిక వర్గం నుంచి నాయకత్వం రావాలని, ప్రతి సామాజిక వర్గం నుంచి ఒక నాయకుడు రావాలని, అందరికీ సమన్యాయం జరగాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయమని అన్నారు. రాష్ట్రంలో బీసీ వర్గానికి నిజమైన నాయకత్వం ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. టీడీపీ స్థాపించినప్పటి నుంచి అన్న ఎన్టీఆర్ నుంచి ప్రతి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వెలమ సామాజిక వర్గం నుంచి ఎర్రం నాయుడు, అయ్యన్నపాత్రుడు, తూర్పు కాపు నుంచి కళా వెంకట్రావు, యాదవ సామాజిక వర్గం నుంచి పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర టిడిపి అధ్యక్షుడిగా ఇలాంటి ఎంతో మందిని కీలక నాయకులుగా తయారు చేశారన్నారు. గతంలో గుంటూరు, కృష్ణా జిల్లాల మధ్యలోనే మంత్రి పదవులు ఉండేవని, కానీ టీడీపీ వచ్చాక ప్రతి జిల్లాకు, ప్రతి సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇచ్చే సంప్రదాయం తెచ్చారన్నారు. ఉత్తరాంధ్రలో నేడు బీసీలు కీలక పదవుల్లో ఉన్నారంటే అది టీడీపీ వల్లనేనన్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా ఒక సామాన్యుడిని నాయకుడిగా తయారు చేసిన పార్టీ టీడీపీ మాత్రమేనని, తనలాంటి యువకుడికి మంత్రి పదవి ఇచ్చి సేవ చేసే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్ పై హైకోర్టులో అనుకూల తీర్పు రాలేదని, సుప్రీంకోర్టుకు వెళ్తున్నామని, అక్కడ అనుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. రూరల్ ఏరియాలో 34 , అర్బన్ లో 33.3 బీసీ రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులతో త్వరలో వాదనలు జరుగుతాయన్నారు. తన తాతగారు సామాన్య రైతు నుంచి జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎంపీగా అన్న నందమూరి తారకరామారావు అవకాశం ఇచ్చారు, తన బాబాయ్ కి రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చారని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి లీడర్ షిప్ రావాలంటే 34 రిజర్వేషన్ తప్పనిసరి అని, ప్రతి సామాజిక వర్గం నుంచి నాయకత్వం తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

భోజన సమయంలో విద్యార్థినులపై పర్యవేక్షణ ఎక్కడ?

- గురుకుల బాలికల పాఠశాలలో భద్రత గాలికొదిలేశారా?
- వేడి చికెన్ కూరలో పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు
- యాజమాన్యం నిరక్ష్య ధోరణిపై తల్లిదండ్రుల ఆందోళన

సత్తెనపల్లి, అక్టోబర్ 4 (ప్రభాత వార్త): రామకృష్ణాపురంలోని గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ప్రమాదం కలకలం రేపుతోంది. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినుల మధ్య జరిగిన తోపులాటలో అవంతిక అనే విద్యార్థిని వేడి చికెన్ కూర ఉన్న డబరాలో ప్రమాదవశాత్తూ పడిపోయినట్లు సమాచారం. ఈ ఘటనలో విద్యార్థిని శరీరంపై తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది.

సుమారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో విద్యార్థినులు భోజనం చేసేందుకు క్యూలో నిలబడిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. క్యూలో విద్యార్థినుల మధ్య తోపులాట జరగడంతో అదుపు తప్పిన అవంతిక వేడి చికెన్ కూర ఉన్న డబరాలో పడిపోయినట్లు తెలుస్తోంది. వేడి కూర కారణంగా విద్యార్థినికి తీవ్ర గాయాలు కావడంతో తోటి విద్యార్థినులు, సిబ్బంది వెంటనే ఆమెను బయటకు తీసినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన అనంతరం విద్యార్థినికి వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. సుమారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో అవంతికను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులకు పాఠశాల ప్రిన్సిపల్ సమాచారం అందించినట్లు సమాచారం. అయితే, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన గురుకుల పాఠశాలలో ఇలాంటి ప్రమాదం జరగడంపై పాఠశాల యాజమాన్యం తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థినులు భోజనం చేసే సమయంలో బాధ్యత వహించాల్సిన సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ ఉంది? వేడి ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించే సమయంలో కనీస భద్రతా చర్యలు ఎందుకు తీసుకోలేదు? విద్యార్థినులు క్యూలో నిలబడే ప్రాంతంలో తోపులాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు ఎందుకు చేపట్టలేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఘటన అనంతరం మొదట అవంతికను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో 12 ఏళ్ల అవంతికను తదుపరి చికిత్స కోసం గుంటూరులోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఒక విద్యార్థిని తీవ్రంగా గాయపడేంతటి ప్రమాదం చోటు చేసుకోవడం పాఠశాలలో భద్రతా చర్యల అమలుపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, యాజమాన్యం లేదా సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.అదేవిధంగా, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భోజన సమయంలో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు, వేడి ఆహార పదార్థాల నిర్వహణ, విద్యార్థుల భద్రతకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

గాంధీ సత్రం ఆవరణలో మహిళ అనుమానాస్పద మృతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 4,(ప్రభాతవార్త : కాకినాడ జిల్లా తుని పట్టణంలోని గొల్ల అప్పారావు సెంటర్ వద్ద గల గాంధీ సత్రం ఆవరణలో మహిళ అనుమానాస్పద మృతి ఘటన ఆదివారం కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందినట్లు వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. సుమారు 50 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ శరీరంపై గాయాలతో గాంధీ సత్రం ఆవరణలో గల వంటశాల లో మృతి చెంది ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మృతురాలు తుని మండలం ఎన్ ఎస్ వి నగరం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసిందన్నారు. ఈ సంఘటనపై తుని పట్టణ సీఐ గీత రామకృష్ణ, ఎస్సై విజయబాబు ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలని ఎవరైనా దుండగులు హత్య చేశారా, హత్యకు గల కారణాలేంటి అనే కోణంలో దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ నడిబొడ్డున మహిళ అనుమానాస్పద మృతి పై పట్టణంలో కలకలం రేగింది.

సౌత్ జాన్ రోల్ బాల్ ఛాంపియన్‌గా తమిళనాడు

తిరుపతి క్రీడ, అక్టోబర్ 4 ప్రభాతవార్త: స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన సెవెంత్ మినీ సౌత్ జోన్ రోల్ పోటీలలో తమిళనాడు జట్లు ఛాంపియన్షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలకు ఆంధ్ర తెలంగాణ తమిళనాడు పుదుచ్చేరి అండమాన్ రాష్ట్రాల నుంచి అండర్ 11 బాలబాలికల 12 జట్లు ప్రాతినిధ్యం వహించాయి. తుది పోరులో అసాధారణ ప్రతిభ కనబరిచిన తమిళనాడు బాలుర బాలికల చెట్లు విజయం సాధించాయి. ఆంధ్ర బాలుర జట్టు, కేరళ బాలికల జట్టు రన్నరప్పుకు సరిపెట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి ఎస్ డి ఓ శశిధర్ హాజరై విన్నర్స్ విన్నర్స్ జట్లకు టోపీలు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోళి, ఉపాధ్యక్షుడు ప్రదీప్, కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, వీజీ ప్రేమనాథ్ పాల్గొన్నారు.

'తులసి' మిల మిల !

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులు కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగ పడతాయి. మన ఇంట్లో ఉంటే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి. మొటిమలకు.. తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గ ముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది. తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్ కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది. తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మం రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలుక్రమంగా తగ్గుముఖం పడతాయి. తులసి రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముకానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమంనం కలుగుతుంది.

నల్లమచ్చలుంటే..! ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకో సారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్ల మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతి వంతంగా మారుతుంది. □

కలశారాధనతో..

హైందవ ధర్మంలో కలశాన్ని దైవస్వరూపంగా ఆరాధించటం ఆనవాయితీ. దీని వెనుక పౌరాణిక నేపథ్యం ఉంది. శ్రీమహావిష్ణువు నాభి నుంచి పద్మం పుట్టింది. అందులో సృష్టి కారకుడైన చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించాడు. ఆయన ఈ జనావళిని సృష్టించాడు. 'కలశం'లోని నీరు సృష్టి ఆవిర్భవించటానికి కారణభూతమైన జలానికి ప్రతీక. అది అందరికీ జీవశక్తి ప్రదాత. కలశం మీద ఉంచిన మామిడాకులు, నారికేళం ఈ సృష్టికి ప్రతీకలు. కలశం చుట్టూ కట్టిన దారం ఈ సృష్టితో కలిపి ఉంచే ప్రేమకు సూచన. అందుకే కలశాన్ని శుభప్రదంగా భావించి, ఏ దైవ కార్యక్రమంలోనైనా స్థాపన చేసి ఆరాధిస్తారు. ఆ కలశంలోకి సమస్త నదుల జలాల్ని ఆహ్వానిస్తారు. సర్వ వేద విజ్ఞానాన్నీ, సకల దేవతల ఆశీస్సుల్ని అందులోకి ఆవాహన చేస్తారు. అలా చేసిన తర్వాత కలశంలోని జలాన్ని అభిషేకంతో సహా అన్ని రకాల క్రతువులకూ వాడతారు. దేవతలు, రాక్షసులు క్షీ రసాగరాన్ని మధించినప్పుడు.. అందులోంచి ధన్వంతరి స్వామి అమృత కలశంతో ప్రత్యక్షమ య్యాడు. ఆ కలశంలోని అమృతం జరామరణ భయం లేకుండా చేస్తుంది. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తమ భార్యలైన సరస్వతి, లక్ష్మి ్మ, పార్వతీదేవిలతో కలశంలో నివసిస్తారని పురాణాలు చెబుతు న్నాయి. అలాగే లక్ష్మీ ్మదేవి పద్మంలో కొలువై ఉండగా.. ఆమెకు చెరో వైపున రెండు ఏనుగులు తమ తొండాలతో కలశ జలాన్ని అభిషేకిస్తున్న దృశ్యం చిత్రాల్లో కనిపిస్తుంది. □

పని తగ్గాలంటే ..

తెల్ల వారింది మొదలు, నిద్రపోయే వరకూ ఎన్ని పనుల్లో కొన్ని చిట్కాలతో జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చిలా! నిమ్మ, బత్తాయి నుంచి ఎక్కువ రసం తీయాలనుకుంటున్నారా... అయితే వాటిని ముందు వేడినీళ్లలో వేసి తీయండి. చల్లారాక పిండితే మెత్తగా ఉండటమే కాదు, ఎక్కువ రసం కూడా వస్తుంది. 5–10 నిమిషాలు తీరిక ఉంది... చేయడానికి పెద్ద పని లేదని అనుకుంటు న్నారా? అయితే దాన్ని చెక్‌ఇట్ టైం పెట్టుకోండి.

సాధారణంగా ఉపయో గించే పరికరాలను పరీక్షి ంచండి. దానివల్ల జరిగే పెద్ద ఇబ్బందిని ముందే గుర్తించినట్లవుతుంది. ప్లాస్టిక్ టబ్లు లీక్ అయినా, అంచులు విరిగినా చెత్తలో పడేస్తున్నారా? వాటిని ఎన్ని రకాలుగా పునర్వినియోగించవచ్చో తెలుసా? మట్టి నింపి గార్డెన్‌గా మార్చొచ్చు. శాండ్‌బాక్స్ మార్చి... చిన్నారులను ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. పిల్లలు బొమ్మలతో ఆడుకున్నాక వాటిని ఈ టబ్లో పెట్టమంటే సర్దే పని తగ్గుతుంది. బట్టలు ఉతకడం, ఆరబెట్టడం, మడత బెట్టడం... వీటి నుంచి విముక్తి లేదా అనిపిస్తుంది. కొన్నిసార్లు! మొదటి దాని సంగతేమోగానీ, మడత పని కొంతవరకూ తగ్గించుకోవచ్చు. ఎలాగంటే... కొన్ని చీరలూ, డ్రెస్సుల్ని హ్యాంగ్‌కు తగిలించండి. పైజామాలూ, పిల్లల బట్టల్ని బాస్కెట్లలో వేయండి. నిర్విరామంగా పనిచేసినప్పుడు ఒత్తిడిగా ఉన్నా... వెంటనే ఇంటి నుంచి బయటకు, బాల్కనీలోకి లేదంటే కిటికీ తెరిచి.. దీర్ఘమైన శ్వాస తీసుకోండి. మెదడుకు అధిక మోతాదులో ఆక్సిజన్ అందితే, ఒత్తిడి నుంచి ఉపశమన అని పరిశోధనలు చెబుతున్నాయి. □

ఇలా ఎదుగుదాం !

కెరియర్లో ఎదగాలని అనుకోని అమ్మాయుండదు. కానీ దానికోసం సాధారణంగా ఏం చేస్తాం? కష్టపడతాం, అందరికంటే ఎక్కువ పనిచేస్తాం. గంటలు కేటాయిస్తాం. చివరికి ఏమవుతుంది? ఒకానొక దశకి వచ్చేసరికి అలసట ఆవహిస్తుంది. అందుకే స్మార్ట్‌గా ఆలోచించాలి, పనిచేయాలి. ముఖ్యంగా 5 అలవాట్లు చేసుకోవాలి అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

ముందే నేర్చుకోవాలి: కెరియర్‌లో ఒక్కో టడుగూ ముందుకు వేసేటప్పుడు కొన్ని నైపుణ్యాలు కావాల్సి వస్తుంది. చాలామందికి ఆ దశకి చేరుకున్నాక నేర్చుకోవచ్చులే అని అనిపిస్తుంది. కానీ... కోర్సు, టెక్నాలజీ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్... ఇలా ఏదైనా ప్రమోషన్, అవసరంతో సంబంధం లేకుండా నేర్చుకోండి. అప్పుడే అవకాశం వచ్చేనాటికి సిద్ధంగా ఉంటారు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు.

టాలెంటే సరిపోదు: చాలాసార్లు ప్రతిభ మాత్రమే సరిపోదు. సహోద్యోగులు, మెంటార్లు నిపుణులు.. ఇలా చాలామంది తోడ్పాటే కావాలి. అందుకే వాళ్లందరితో సత్సంబంధాలను పెంచుకోండి. బలమైన ప్రొఫెషనల్ నెట్వర్క్ ఉంటే కొత్త ఆలోచనలు వస్తాయి. మార్గనిర్దేశం దొరుకుతుంది. మంచి అవకాశాల వివరాలు తెలుస్తాయి.

విమర్శ కావాలి: విమర్శ కోపాన్నీ, బాధనీ కలిగిస్తుంది వాస్తవమే! చెడుగా చూసినప్పుడే ఇలా. సానుకూలంగా చూడండి. సద్విమర్శలా తీసుకోండి. మీ లోపాలను తేలిగ్గా గుర్తించొచ్చు. వేగంగా వాటిని మార్చుకునే అవకాశమూ దొరుకుతుంది. విమర్శలను స్వీకరించిన వారే త్వరగా ఎదుగుతారు కూడా. కాబట్టి, వాటినీ పట్టించుకోండి.

నిరంతరం కావాలి: రోజూ పర్ఫెక్ట్‌గా ఉండాల్సిన పని లేదు. కానీ కొన్ని అలవాట్లు మాత్రం నిరంతరం సాగేలా చూసుకోవాలి. ఈ సమయంలో పని పూర్తిచేయడం, ప్రతివారం ఏదో ఒకటి నేర్చుకోవడం, సానుకూలంగా ఆలోచించడం అలవాటు చేసుకోండి. ఇవి దీర్ఘకాల విజయానికి నాంది వేరు పలుకుతాయి.

సరిచూసుకోండి: నువ్వు బాగా చేశావ్, 'నీకిది రాదు'... చాలామంది ఇలాంటివి మనకి చెబుతూనే ఉంటారు. మిమ్మల్ని మీరు అడిగారా? అడగండి. నేనెక్కడున్నా? నేనేం మార్చుకోవాలి? ఎక్కడ వెనకబడ్డ అని స్వీయ సమీక్ష చేసుకోండి. పరిశ్రమ ఏదైనా మార్పు అనివార్యం. వాటికి తగ్గట్టుగా మీరున్నారా లేదా అని ఎవరో చెప్పేదాకా ఆగొద్దు. మీరు మీరే పరిశీలించుకోవాలి. అవసరమైతే మారాలి. వీటన్నింటికే డ్రైవ్ రూల్ అని పేరు. గంటలకొద్దీ పనిచేస్తూ పోవడం కాదు. పరిస్థితులను గమనించుకుంటూ వాటికి అనుగుణంగా ఎవరికి వారు తమని తాము మార్చుకుంటూ వెళ్లాలని సూచించండి. అనుసరించే నైపుణ్యాలను పెంచుకోవచ్చు, అవకాశాలు అందుకోవచ్చు. ముఖ్యంగా ఆత్మవిశ్వాసంతో కెరియర్‌లో దూసుకెళ్లొచ్చు. □

దానిమ్మ జ్యూస్ !

ఎర్రటి దానిమ్మ గింజలు చూడ్డానికి భలే ఆకర్షణీ యంగా ఉంటాయి కదా. తినడానికి రుచి గానూ ఉంటాయి. కానీ బలుచుకుని తినాలంటేనే ఎక్కడలేని నీరసం ముంచు కొస్తుంది. పోనీ మిక్సీలో వేసి జ్యూస్ తీసుకోవాలంటే జార్ సిద్ధం చేసుకోవాలి. సమయానికి కరెంటు లేకపోతే మరో ఇబ్బంది కానీ ఇలాంటి జ్యూసర్ ఒకటి ఉంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. గింజలను దీంట్లో వేసి చేత్తో ఒత్తుతూ పైభాగాన్ని తిప్పితే చాలు జ్యూస్ కింది పాత్రలోకి దిగుతుంది. తర్వాత దీన్ని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు కూడా. □

మునగతో పోషకాల చపాతి

ఆరోగ్యానికి మంచిదని మునక్కాడలు లేదా మునగాకుతో చారు చేస్తే.. పిల్లలు ససేమిరా తినరు. ఆ ఆకును పిండిలో కలిపి..చపాతి చేశారనుకోండి. వంక పెట్టకుండా తినేస్తారు. మునగ చపాతి ఎలా చేయాలంటే.. మునక్కాడలను ముక్కలు కోసం, ఉడికించి, పప్పుగుత్తితో మెత్తగా మెదపాలి. గుజ్జును ఉంచి, పిప్పిని తీసేయాలి. ఇందులో కప్పు గోధుమపిండి, అరకప్పు వేయించిన మునగాకు, రెండు చెంచాల కొత్తిమీర, చెంచా నూనె వేసి బాగా కలపాలి. దానికి కారం, ఉప్పు, పసుపు, జీలకర్ర పొడి, ధనియాల పొడి, వేయించిన నువ్వులు జతచేయాలి. గుజ్జులో ఉన్న తడి సరిపోలేదంటే.. కొన్ని నీళ్ల చిలకరిస్తూ కలిపి పక్కన ఉంచాలి. అరగంట నాననిచ్చి చపాతీలు ఒత్తుకుని పెనం మీద నూనె లేదా నెయ్యితో కాల్చు కోవాలి. అంతే.. నోరూరించే మునగ చపాతీలు రెడీ. మునగలో ఐరన్, పొటాషియం, జింక్.. ఇలా శరీరానికి అవసరమైన పోషకాలు అనేకం ఉన్నాయి. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రుచి మాత్రమే కాదు..కాకుండా ఇంత మేలు చేస్తుంది కనుక. మీరూ ప్రయత్నించండి. □

తెర

భోగి

హై ఇంటెన్స్ టీజర్

చార్మింగ్ స్టార్ శర్వా డిఫరెంట్ ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. లక్ష్మీ ్మ రాధామోహన్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మిగిలిన షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని పరిచయం చేస్తూ.. పాలేగాళ్ళు కమ్మరి గంగను తీసుకెళ్లారని అనుపమ పరమేశ్వరన్ పాత్ర చెబుతుంది. హీరో, అతని ప్రేమకథకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా.. ఒక రా, ఇంటెన్స్, రూటెడ్, ర్యాజింగ్ ప్రపంచానికి టీజర్ ప్రజెంట్ చేసింది. 1960ల ప్రారంభంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. సంపత్ నంది ఈ కథను ఎంతో సహజంగా, నేటివిటీతో తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది.

కామ్రేడ్ కళ్యాణ్

టైటిల్ సాంగ్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా కామ్రేడ్ కళ్యాణ్‌తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా మాస్ మహారాజా రవితేజ ఖికామ్రేడ్ కళ్యాణ్ఖి టైటిల్ సాంగ్ లాంచ్ చేశారు. విజయ్ బుల్గానిన్ ఫన్ ఫుల్ గా ఈ పాటను కంపోజ్ చేశారు. రాహుల్ సిప్లిగంజ్ వాయిస్‌తో పవర్‌ఫుల్ ఎనర్జీని అందించగా, భాస్కరభట్ల రాసిన లిరిక్స్ కామ్రేడ్ గా హీరో క్యారెక్టర్ ను ఎంటర్టైనింగ్ గా ప్రజెంట్ చేశాయి. విడుదలైన వెంటనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్ర ల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

అక్టోబర్ 30న కల్ట్

విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో, హీరోగా భారతీయ చలన చిత్రాల్లో నే మొట్ట మొదటి స్లాశర్‌గా రూపొందుతున్న కల్ట్ సినిమా భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. సేన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బసూర్ గారు అందించిన పాటలతో పాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో సంచలనం కాబోతుంది. ఈ సినిమా షూటింగు పూర్తి చేసుకుంది. ఇప్పుడున్న యూత్‌లో ప్రత్యేకమైన కల్ట్ ఫాలోయింగ్ ఉన్న సన్సెషన్ తరుణ్ భాస్కర్ అందించిన మాటలు మరో హైలైట్. తారక్ సినిమా బ్యానర్ పై సందీప్ కాకరాల ఖర్చుకు వెనకాడకుండా అత్యంత భారీగా టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ కల్ట్ సినిమాలో సినీ దిగ్గజలందరూ పాలు పంచుకుంటున్నారు, సచిన్ అందిస్తున్న సౌండ్ డిజైన్ ఒక ప్రత్యేక స్థాయిలో నిలబెట్టింది, భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషలలో రూపొందుతున్న కల్ట్ సినిమాలో విశ్వక్ సేన్, గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, పుష్ప ఫేమ్ తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ, లాంటి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 30 కి విడుదలకు సిద్ధం అవుతున్న ఈ కల్ట్ సినిమా ప్రేక్షకులకు నెవర్ బిఫోర్ ఎక్స్పీరియన్స్ అందించబోతోంది.



ఎన్టీఆర్‌కు మద్దతుగా విజయ్ దేవరకొండ

మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోతున్నామంటూ పోస్ట్ ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాలోని చుట్టమల్లే పాటను ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ తో మహిళల్ని కించపరిచేలా రూపొందించిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ ఘటనపై హీరో ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన ఆగ్రహాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్ కు మద్ధతుగా నిలబడేందుకు ముందుకొచ్చారు విజయ్ దేవరకొండ. మానవీయ విలువల్లో మనం పూర్తిగా దిగజారిపోయామంటూ ఆయన ట్వీట్ చేశారు. హీరో విజయ్ దేవరకొండ స్పందిస్తూ విలువల పరంగా మనం నీచమైన స్థాయికి దిగజారిపోతున్నాం. ఈ ఘటనకు బాధ్యతలైన వారిని వదిలిపెట్టకూడదు. చట్టపరంగా వారిని కఠినంగా శిక్షి ంచాలి. మరొకరు ఇలాంటి తప్పు చేయకుండా గుణపాఠం నేర్పాలి. పిల్లల్ని ఎలా పెంచుతున్నాం, మనం ఎలాంటి సమాజంలో జీవిస్తున్నామనే సందేహాన్ని ఈ ఉదంతం రేకెత్తిస్తోంది. మరొకరిని బాధపెట్టడంలో సంతోషాన్ని వెతుక్కునేలా మారిపోవడం బాధాకరం. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని ప్రపంచమంతా భయపడుతుంటే మరోవైపు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు ఇలాంటి తప్పుడు పనులకు ఉపయోగించుకుంటున్నారు. డిజిటల్ వేదికలపై జరిగినా దీన్ని లైంగిక దాడితో సమానంగా పరిగణించాలి. చట్టప్రకారం తీవ్రంగా శిక్షి ంచాలి. ఈ ఘటనను వ్యతిరేకిస్తున్న ప్రతి ఒక్కరికీ నా పూర్తి మద్దతు ఉంటుంది. అన్నారు.

లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్

ఫన్ ఫుల్ ట్రైలర్ రిలీజ్

హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక నిగిజు జ్ఞూలో'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. తన కొడుకుని ప్రేమించని హర్ష తండ్రి అమ్మాయిలని రిక్వెస్ట్ చేసే సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. హర్ష ఫన్ టైమింగ్ అలరించింది. హైపర్ క్యారెక్టర్ మరో హైలైట్‌గా నిలిచింది. జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం ఎంటర్టైమెంట్ ని మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.

ధరణి ఐ లవ్ యు మూవీ పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్

ధరణి ఐ లవ్ యు మూవీ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత, ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్.... ఘనంగా ఆవిష్కరించారు. చిత్ర బృందం సమక్షంలో జరిగిన ఈ పోస్టర్ లాంచ్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌కెఎన్ మాట్లాడుతూ..ధరణి ఐ లవ్ యు సినిమా పోస్టర్ ఆసక్తికరంగా ఉందని, టైటిల్‌తోనే సినిమాపై క్యూరియాసిటీ కలుగుతోందని అన్నారు. డైరెక్టర్ సాయికృష్ణ కె.వి కి ఇది సెకండ్ మూవీ.. తను రాజమౌళి గారి దగ్గర మగధీర మూవీకి అసోసియేట్ గా వర్క్ చేసారు.. నిర్మాత రాజ శేఖర్ గారికి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షి ంచారు. డైరెక్టర్ సాయికృష్ణ కె.వి మాట్లాడుతూ ప్రొడ్యూసర్ ఎస్‌కెఎన్ గారి చేతుల మీద మా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ అవ్వటం చాలా సంతోషంగా ఉంది.. ఆయన ఇండస్ట్రీ లో టైమింగ్ ఉన్న ప్రొడ్యూసర్.. బేబీ, చెన్నై లవ్ స్టోరీ.. ఇలా వరుస విజయలతో బిజీ ఉండి ధరణి ఐ లవ్ యు పోస్టర్ లాంచ్ చేసినందుకు చాలా థాంక్స్.. ఆయన స్టేజ్ మీద ఒక రైమింగ్ తో టైమింగ్ లో ఇచ్చే స్పీచ్ కి చాలా మంది ఫ్యాన్స్ ఉంటారు.. అందులో నేను ఒకడిని అన్నారు..

5-10pg10.qxd:5-10pg10.qxd 1/1/02 6:35 AM Page 1

జపాన్ ఓపెన్: సెమీఫైనల్‌కు అల్కరాజ్

టోక్యో: జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్‌ఫైనల్ పోరులో డెనిస్ షపోవలోవ్ రెండవ సెట్ ప్రారంభంలోనే వైదొలగడంతో, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన తొలి సెట్ తర్వాత, 82 నిమిషాల అనంతరం డిఫెండింగ్ ఛాంపియన్ 7-6(3), 2-1 ఆధిక్యంలో ఉండగా షపోవలోవ్ ఆట నుండి వైదొలగాల్సి వచ్చింది. షపోవలోవ్ అద్భుతంగా ప్రారంభించి, 5-3 ఆధిక్యం సాధించి, 5-4, 30/40 వద్ద సెట్ పాయింట్‌ను సంపాదించాడు. అయితే అల్కరాజ్ ఒక డ్రాప్ షాట్‌తో ఆ అవకాశాన్ని కాపాడుకుని తిరిగి పోటీలోకి వచ్చాడు. ఆ తర్వాత ఆ స్పానిష్ ఆటగాడు టైబ్రేక్‌లో ఆధిపత్యం చెలాయించి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. మొదటి సెట్‌లో ఆరుసార్లు సర్వ్ బ్రేక్‌లు జరగ్గా అల్కరాజ్ మూడుసార్లు బ్రేక్ అయినప్పటికీ ప్రతిసారీ కోలుకోగలిగాడు. రెండవ సెట్ ప్రారంభంలో షపోవలోవ్ తుంటికి గాయం కావడంతో ఆటను కొనసాగించలేకపోయాడు. దీంతో అనూహ్యంగా అల్కరాజ్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీఫైనల్స్‌లో అల్కరాజ్ తన తోటి స్పానిష్ ఆటగాడైన జౌమ్ మునార్‌తో తలపడనున్నాడు.

ఫిఫా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో..

భారత్ ఓటమి

4-0 తేడాతో బ్రెజిల్ గెలుపు

కోల్‌కతా: తొలి 25 నిమిషాల పాటు భారత్ వీరోచితంగా పోరాడినా, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ జట్టు ఇక్కడ జరిగిన ఫిఫా అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో 4-0 తేడాతో సునాయాసంగా గెలిచింది. భారత్ తొలి 25 నిమిషాల్లో కొన్ని మంచి అవకాశాలను దక్కించుకున్నప్పటికీ గోల్ చేయలేకపోయింది. అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా ఆటను తమ నియంత్రణలో ఉంచుకున్న దక్షిణ అమెరికా జట్టు తరఫున ఎస్టెవావో (28వ నిమిషం), పెడ్రో (42వ), శామ్యూల్ లినో (58వ, 90+5వ) గోల్స్ చేశారు. ఆట ఆరంభ దశలో భారత్ బ్రెజిల్‌ను నిరాశకు గురిచేయడం కొనసాగించింది. మన్వీర్ సింగ్ అవకాశాలను కల్పించగా, ర్యాన్ విలియమ్స్, అషిక్ కురునియన్ ఎదురుదాడిలో ప్రయత్నించాడు. కానీ భారత గోల్ కీపర్ మొదటి ప్రయత్నాన్ని సమర్థవంతంగా అడ్డుకున్నాడు. బాక్స్ అంచున బంతిని అందుకున్న ఎస్టెవావో, అషిక్‌ను తప్పించుకుని సమీప పోస్ట్ వైపు బంతిని కొట్టడంతో చివరకు గోల్ లభించింది. ఆ శక్తివంతమైన కిక్‌ను గుర్‌ప్రీత్ చేతితో అడ్డుకున్నప్పటికీ, దానిని ఆపలేకపోయాడు, దీంతో సులభమైన గోల్ అయింది.

ఇరానీ కప్ విజేతగా రెస్ట్ ఇండియా

జమ్మూ కశ్మీర్‌పై 167 రన్స్‌తో గెలుపు

శ్రీనగర్: రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్ము కశ్మీరోతో జరిగిన ఇరాని కప్ ఫైనల్లో రెస్ట్ ఆఫ్ ఇండియా అద్భుతమైన ప్రదర్శనతో తిరుగులేని విజయం సాధించింది. మ్యాచ్ నాలుగో రోజు ఆదివారం భారత పేసర్లు ముఖేష్ కుమార్ (6/33), ఆకాశ్ దీప్ (3/25) కిరాక్ బౌలింగ్‌తో చెలరేగడంతో జమ్ము కశ్మీర్ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. ఫలితంగా రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 167 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి ఇరాని కప్‌ను ముద్దాడింది. మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా 279 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్ము కశ్మీర్ జట్టు ఆరంభంలో గట్టిగానే పోరాడింది. ఓపెనర్లు శుభమ్ ఖజురియా (36), ఖమ్రాన్ ఇక్బాల్ (32) తొలి వికెట్‌కు 54 రన్స్ జోడించి మంచి ఆరంభాన్నిచ్చింది. మ్యాచ్ నాలుగో రోజు లంచ్ సమయానికి జేఅండ్కే 3 వికెట్ల నష్టానికి 89 పరుగులతో పటిష్ట స్థితిలో ఉన్నట్లు కనిపించింది. కానీ తర్వాత మ్యాచ్ పూర్తిగా మారిపోయింది. ఆకాశ్ దీప్ వేసిన తొలి

బంతికే శుభమ్ ఖజురియా ఔట్ కావడం మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ తర్వాత కేవలం 22 రన్స్ వ్యవధిలోనే జమ్ము కశ్మీర్ తన చివరి 6 వికెట్లను కోల్పోయి కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది.

ఈ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా పేసర్ ముఖేష్ కుమార్ కేవలం 33 రన్స్ మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా 15వ ఓవర్లో శుభమ్ పుండిర్, కెప్టెన్ పరస్ డోగ్రాను వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపి మ్యాచ్‌ను పూర్తిగా రెస్ట్ ఆఫ్ ఇండియా వైపు తిప్పేశాడు. మరోవైపు ఆకాశ్ దీప్ (3/25) కూడా అత్యంత కసిగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు.



చైనా ఓపెన్‌లో నికోలా సంచలనం

వరుస సెట్లలో సబలెంకా ఓటమి

బీజింగ్: చెక్ రిపబ్లిక్‌కు చెందిన నికోలా బార్టుంకోవా చైనా ఓపెన్‌లో ఒక పెద్ద సంచలనం సృష్టించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 2 అరీనా సబలెంకాను వరుస సెట్లలో ఓడించి నాలుగో రౌండ్‌కు చేరుకుంది. ప్రపంచ నంబర్ 1 ఎలెనా రైబాకినా కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించిన ఒక రోజు తర్వాత, ప్రపంచ 34వ ర్యాంకర్ అయిన 20 ఏళ్ల క్రీడాకారిణి ఒక గంట 35 నిమిషాల పోరులో 6-4, 6-3 తేడాతో విజయం సాధించింది. బార్టుంకోవా సబలెంకా సర్వ్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి, ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా కోల్పోకుండా, టాప్ 10 క్రీడాకారిణిపై తన కెరీర్‌లో రెండవ విజయాన్ని నమోదు చేసింది. తొలి సెట్‌లో సబలెంకా సర్వ్‌ను బ్రేక్ చేసి బార్టుంకోవా ఆరంభంలోనే ముందంజ వేసింది. ఆ తర్వాత ఆరో గేమ్‌లో ఐదు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని 4-2 ఆధిక్యం సాధించింది. తర్వాతి గేమ్‌లో మరో బ్రేక్ సాధించే మూడు అవకాశాలను కోల్పోయినప్పటికీ, చెక్ క్రీడాకారిణి తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరి రెండు గేమ్‌లలో ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా తన సర్వ్‌ను నిలబెట్టుకుని సెట్‌ను 6-4తో కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో కూడా సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బార్టుంకోవా తన సర్వీస్‌పై నిలకడగా ఉంటూ, తొమ్మిదవ గేమ్‌లో బెలారసియన్ క్రీడాకారిణి సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసి 6-3 తేడాతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

వరల్డ్ కప్: టీమిండియా స్క్వాడ్ ఫిక్స్!

రోహిత్, కోహ్లి ఇన్..

బ్యాటింగ్, పేస్, ఆల్‌రౌండర్లకు సమాన ప్రాధాన్యం

న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్ 2027 కోసం టీమిండియా ఎలా ఉండబోతుందనే దానిపై భారత్ క్రికెట్ బోర్డు కసరత్తు చేస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించే ఈ టోర్నీకి సంబంధించి అధికారిక షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆఫ్రికా పిచ్‌లపై

ఉండే వేగం, బౌన్స్‌ను దృష్టిలో ఉంచుకుని బ్యాటింగ్, పేస్, ఆల్‌రౌండర్లకు సమాన ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్ టీమిండియా కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. అతడితో కలిసి రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడే అవకాశం ఉంది. కొత్త బంతిని ఎదుర్కొంటూ వేగంగా పరుగులు చేయగల రోహిత్ అనుభవం జట్టుకు ఉపయోగపడుతుంది. మిడిల్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. రాహుల్ బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా తీసుకునే ప్రధాన ఎంపికగా కనిపిస్తున్నాడు. బ్యాకప్ కీపర్, ఫినిషర్ పాత్ర కోసం ఇషాన్ కిషన్, ధ్రువ్ జురెల్‌లో ఒకరికి అవకాశం దక్కొచ్చని తెలుస్తోంది. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా కీలకంగా ఉండే అవకాశం ఉంది. అతడికి తోడుగా నితీష్ కుమార్ వంటి సీమ్ ఆల్‌రౌండర్‌ను తీసుకునే అవకాశం ఉంది. స్పిన్ ఆల్‌రౌండర్ విభాగంలో అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా పేర్లు ఉన్నాయి. వీరిద్దరూ బ్యాటింగ్‌లోనూ ఉపయోగపడగలగడం జట్టు కూర్పుకు అదనపు బలం కావొచ్చు. పేస్ విభాగానికి జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించే వీలుంది. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ లేదా హర్షిత్ రాణా లో ఒకరికి చోటు దక్కొచ్చని అంచనా.

ఎడమచేతి పేసర్‌గా అర్ష్‌దీప్‌సింగ్ జట్టులో వైవిధ్యం తీసుకురాగలడు. డెత్‌ఓవర్లలో అతడి బౌలింగ్ ఉపయోగపడుతుందని స్పోర్ట్స్ పేర్కొంటోంది. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్‌కు చోటు దాదాపు ఖాయంగా భావిస్తున్నారు. మిడిల్ ఓవర్లలో అతడి బౌలింగ్ కీలకంగా మారొచ్చని అంచనా.

పరిశోధన అభివృద్ధిలో ప్రైవేటు వ్యయం పెరగాలి: ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబరు 4: భారత ఆర్థిక వ్యవస్థలో తదుపరి దశ వృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులే ప్రధాన చోదక శక్తిగా మారాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రైవేట్ రంగం మూలధన వ్యయంతో పాటు పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)పై పెట్టుబడులను కూడా పెంచాలని పిలుపునిచ్చారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్లో సీతారామన్ మాట్లాడుతూ ఇకపై వృద్ధి చక్రానికి ప్రైవేట్ పెట్టుబడులే నాయకత్వం వహించాలి. పరిశోధన, ఆవిష్కరణల రంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలని అన్నారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి వ్యయం జిడిపిలో కేవలం 0.83 శాతంగా ఉంది. అదే ఒఇసిడి దేశాల్లో ఈ వ్యయం సగటున 2.7 శాతంగా ఉంది. దేశంలోని మొత్తం ఆర్ అండ్ డి వ్యయంలో ప్రైవేట్ రంగం వాటా కేవలం 36 శాతం మాత్రమేనని సీతారామన్ వెల్లడించారు.ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే పెట్టుబడుల పరిమాణాన్ని పెంచడంతో పాటు ఆర్ అండ్ డిలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని కూడా గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల నిధిని ప్రకటించింగని అన్నారు. ప్రైవేట్ రంగం కూడా పరిశోధన, అభివృద్ధిపై అధికంగా ఖర్చు చేసేలా ప్రోత్సహించడం ఈ నిధి ప్రధాన ఉద్దేశం. మేడ్ ఇన్ ఇండియా నుంచి ఇమాజిన్డ్ అండ్ మేడ్ ఇన్ ఇండియా వైపు దేశాన్ని తీసుకెళ్లేందుకు ఈ పథకం దోహదపడుతుందని సీతారామన్ చెప్పారు. అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని విధానాలను రూపొందించాల్సి ఉంటుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు స్థైర్యం కల్పించడం ఒక్కసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. రానున్న సంవత్సరాల్లో వ్యూహాత్మక వనరుల భద్రత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో నిరంతర అనుసంధానం, నైపుణ్యాల అభివృద్ధి ప్రధాన ప్రాధాన్యతలుగా ఉంటాయని ఆర్థిక మంత్రి తెలిపారు. వ్యూహాత్మక వనరుల భద్రత స్థూల ఆర్థిక విధానంలో కీలక అంశంగా మారుతుందని చెప్పారు. భారత్ ఇప్పటికే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్, రేర్ ఎర్త్ కారిడార్స్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 వంటి కార్యక్రమాలను ప్రారంభించిందని తెలిపారు. చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్ల అభివృద్ధిపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.12.22 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని బడ్జెట్‌లో కేటాయించింది.

5.75-6 శాతానికి చేరే రెపో రేటు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా

ముంబయి, అక్టోబరు 4: ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, పెరుగుతున్న ముడిచమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ అధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్‌లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. మరో ఒకటి లేదా రెండు విడతల్లో రేట్ల పెంపు జరిగే అవకాశముందని, దీంతో రెపో రేటు 5.75-6 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణానికి సంబంధించిన ప్రమాదాలు కొనసాగడం, క్రూడ్ ఆయిల్ ధరలు అధిక స్థాయిలో ఉండటం, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటి అంశాలు కఠిన ద్రవ్య విధానానికి అనుకూలంగా మారవచ్చని బ్యాంక్ తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ సెక్యూరిటీల రిటర్నులపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. సెప్టెంబర్‌లో ప్రభుత్వ బాండ్లపై ఒత్తిడి కొనసాగిందని యూనియన్ బ్యాంక్ తెలిపింది. ముడిచమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ ఈల్డ్స్ అధికం కావడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు బలపడ్డాయని దేశీయ బాండ్ సరఫరా పెరగడం కూడా రాబడులు అధికంగా ఉండటానికి మరో కారణమని నివేదిక వివరించింది. ఆర్‌బీఐ చేపట్టిన ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ విక్రయాలు, ఈ యేడాది ద్వితీయార్థ రుణ కార్యక్రమంలో దీర్ఘకాలిక సెక్యూరిటీల వాటా పెరగడం వల్ల బాండ్ సరఫరాపై ఒత్తిడి పెరిగిందని తెలిపింది. మొత్తం ప్రభుత్వ రుణ సమీకరణ తగ్గినప్పటికీ ఈ ప్రభావం కనిపించిందని పేర్కొంది. ఈ ప్రభావం ముఖ్యంగా ఐదేళ్ల ప్రభుత్వ బాండ్ల విభాగంలో ఎక్కువగా కనిపించింది. సెప్టెంబర్‌లో ఐదేళ్ల బాండ్ రాబడులు 45 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇదే సమయంలో పదేళ్ల బాండ్ ఈల్డ్ 24 బేసిస్ పాయింట్లు మాత్రమే పెరిగింది.దీంతో పదేళ్ల, ఐదేళ్ల సెక్యూరిటీల మధ్య ఈల్డ్ వ్యత్యాసం 36 బేసిస్ పాయింట్ల నుంచి 16 బేసిస్ పాయింట్లకు తగ్గిందని యూనియన్ బ్యాంక్ తెలిపింది.

సెప్టెంబరులో రూ.35,861 కోట్ల ఎఫ్‌పిఐలు విత్‌డ్రా

న్యూఢిల్లీ, అక్టోబరు 4: భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల నిధుల విత్‌డ్రా కలవరం పుట్టిస్తోంది. సెప్టెంబర్‌లో భారత ఈక్విటీల్లో ఎఫ్‌పిఐలు ఏకంగా రూ.35,861 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. అక్టోబర్ కూడా ప్రతికూలంగానే ప్రారంభమైంది. ఈ నెలలో ఇప్పటివరకు రూ.9,232 కోట్ల మేర నికర అమ్మకాలు నమోదయ్యాయి.అంతకు ముందు జూలై, ఆగస్టు నెలల్లో ఎఫ్‌పీఐలు భారత మార్కెట్లలో భారీగా పెట్టుబడులు పెట్టారు. జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లను నికరంగా ఇన్వెస్ట్ చేశారు. ముడిచమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలతో వచ్చిన ఈ పెట్టుబడులు తాత్కాలిక పరిణామంగానే మిగిలిపోయాయి. ముడిచమురు ధరలు తగ్గుతా యన్న అంచనాలతో జూలై, ఆగస్టులో నమోదైన సానుకూల ఎఫ్‌పిఐ ప్రవాహాలు తాత్కాలికమేనని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వికె విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అమెరికా బాండ్ రిటర్నులు భారీగా పెరగడం భారత మార్కెట్లపై ఒత్తిడి పెంచుతోంది. 30 యేళ్ల అమెరికా ట్రెజరీ రాబడి వారం క్రితం 5.48 శాతానికి చేరింది. ఇది రెండు దశాబ్దాల గరిష్ఠ స్థాయిగా నమోదైంది. అదే సమయంలో 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ కూడా గత వారం 5.3 శాతానికి చేరింది. అమెరికాలో ఉద్యోగాల కల్పన అంచనాల కంటే మందగించినప్పటికీ, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులపై ఉన్న ఆందోళనల కారణంగా ఇన్వెస్టర్లు ఈ పరిణామాలను పెద్దగా పట్టించుకోలేదు" అని ఛాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ తెలిపారు. ముడిచమురు ధరలు వరుసగా పెరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో ఎక్కువ కాలం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగానే కొనసాగింది.సౌదీ అరేబియా కీలక పైప్‌లైన్ మూసివేతను భర్తీ చేసేందుకు హార్ముజ్ జలసంధి మీదుగా కొంత ముడిచమురును రవాణా చేసినట్లు వార్తలు రావడంతో ధరల పెరుగుదలకు కొంత విరామం లభించింది. అధిక ముడిచమురు ధరలు దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఆందోళనకరంగా మారాయి. ఇరువైపుల నుంచి కాల్పుల విరమణ లేదా శాంతి చర్చలు తిరిగి ప్రారంభమయ్యే స్పష్టమైన సంకేతాలు కనిపించకపోవడంతో విదేశీ ఇన్వెస్టర్లకు ప్రధాన రిస్క్‌గా మారి భారత ఈక్విటీల్లో పెట్టుబడుల పరంగా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రూపాయి విలువ పలుమార్లు డాలర్‌కు రూ.96 స్థాయిని దాటింది. రూపాయి పతనం దేశ ఆర్థిక వ్యవస్థ ముడిచమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ వంటి అంశాలకు ఎంత సున్నితంగా ఉందో వెల్లడి స్తోందని నిపుణులు చెబుతున్నారు. ఎఫ్‌పీఐల అమ్మకాలకు మరో ముఖ్య కారణంగా పోర్ట్‌ఫోలియో రొటేషన్ కీలకం. డాలర్ ఆధారిత ఆస్తులు, ఆసియాలోని టెక్నాలజీ ఆధారిత మార్కెట్లలో ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో విదేశీ పెట్టుబడుల కోసం భారత్ ఇతర మార్కెట్లతో మరింత తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాన్‌ఏఐ ట్రేడ్ గణనీయంగా తగ్గిపోవడంతో అదనపు విదేశీ మూలధనం కోసం భారత్ మరింతగా పోటీ పడాల్సి వస్తోంది" అని ధీరజ్ గౌర్ పేర్కొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి నుంచి న్యూఫండ్ ఆఫర్

ముంబయి, అక్టోబరు 4: ప్రముఖ మూచువల్ ఫండ్ హౌస్ హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ల కోసం ఒక సరికొత్త పాసివ్ ఇండెక్స్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌డిఎఫ్‌సి నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 ప్లస్ 8-13 ఇయర్స్ జీసెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ పేరుతో వచ్చిన ఈఫండ్, డెట్, ఈక్విటీ మిశ్రమ ఇండెక్స్ ఆధారంగా పని చేసే ఒక ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. కేవలం రూ.100 నామమాత్రపు కనీస పెట్టుబడితో ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే సౌకర్యం ఉంది. హెచ్‌డిఎఫ్‌సి తీసుకొచ్చిన ఈ ఫండ్ ఒక పాసివ్ ఫండ్. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సోమవారం ప్రారంభమై ఈనెల 19 వరకు కొనసాగనుంది. డెట్ ఆధారిత ఇండెక్స్ ఫండ్. ఇందులో కనీస పెట్టుబడి రూ.100గాఉంది. ఆతర్వాత రూ.100 చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. సబ్‌స్క్రిప్షన్ సమయంలో యూనిట్ వాల్యూ రూ.10గా ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్ ముగిసిన తర్వాత యూనిట్లకేటాయింపు ఉంటుంది. ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియోలోని నిధులను 70శాతం ఈక్విటీ, 30 శాతం సురక్షితమైన బాండ్లకు కేటాయిస్తారు.

రెపోరేట్, త్రైమాసిక ఫలితాలే ఈ వారం కీలకం

మార్కెట్లకు దిక్సూచి అవుతున్న ఇన్వెస్టర్ల ధోరణులు

ముంబయి, అక్టోబరు 4: రిజర్వ్‌బ్యాంకు వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయం, టిసిఎస్ త్రైమాసిక ఫలితాలు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశించడంలో కీలకంగా మారనున్నాయి. స్థూల ఆర్థిక గణాంకాల విడుదల, విదేశీ పెట్టుబడిదారుల ట్రేడింగ్ కార్యకలాపాలు కూడా మార్కెట్ ధోరణిపై ప్రభావం చూపిస్తాయి. ఆర్బీఐ ద్రవ్య విధాన సమావేశాన్ని మార్కెట్ వర్గాలు అత్యంత ఆసక్తిగా గమనించనున్నాయి. పాలసీ వైఖరి, ద్రవ్యోల్బణ అంచనాలు, ఆర్థిక వృద్ధి అంచనాలు దేశీయ వడ్డీ రేట్లు, ఆర్థిక మార్కెట్ల సమీపకాల గమనంపై కీలక సంకేతాలను అందిస్తాయని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. ఈ వారం నుంచి కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా ప్రారంభం కానుంది. సూచీల్లో కీలకమైన ఐటీ దిగ్గజం టిసిఎస్, రిటైల్ రంగంలోని ప్రముఖ సంస్థ డీమార్ట్ సహా పలు ప్రధాన కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి.సెప్టెంబర్ నెలకు సంబంధించిన హెచ్‌ఎస్‌బిసి సర్వీసెస్ పిఎంఐ, కాంపోజిట్ పిఎంఐ,తుది గణాంకాలు అక్టోబర్ 6న విడుదల కానున్నాయి. టిసిఎస్ త్రైమాసిక ఫలితాలను అక్టోబర్ 8న ప్రకటించనుంది. ప్రస్తుతం స్థూల ఆర్థిక పరిస్థితుల్లో ముడి చమురు ధరలు అత్యంత తక్షణ ఆందోళన కలిగిస్తున్న అంశం. బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగుతున్న బ్రెంట్ క్రూడ్ ధరలు భారత బాహ్య ఆర్థిక సమతుల్యత, ద్రవ్యోల్బణ అంచనాలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అనిశ్చితి కొనసాగడం వల్ల ఇంధన ధరల్లో రిస్క్ ప్రీమియం అధిక స్థాయిలో ఉంటుందని ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్‌టెక్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సిఇఒ పొన్ముడి ఆర్. తెలిపారు. వరుసగా ఎనిమిదో వారమూ నష్టాల్లో మార్కెట్లు విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, రూపాయి బలహీనత, అధిక ముడి చమురు ధరలు, పెరుగుతున్న అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ కారణంగా భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా ఎనిమిదో వారాన్ని నష్టాలతో ముగించాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్, సెప్టెంబర్ వడ్డీ రేట్ల పెంపు తర్వాత మరింత కఠిన ద్రవ్య విధానానికి అమెరికా పాలసీ మేకర్లలో ఎంతమేర మద్దతు ఉందో చెపుతాయని రీసెర్చ్ అనలిస్ట్ సంస్థ హెచ్‌ఎస్‌టి వెల్త్ వ్యవస్థాపకుడు, సిఇఒ హరిసెల్వన్ రాధాకృష్ణన్ తెలిపారు.

డీమార్ట్ నికర రాబడులు రూ.19,206 కోట్లు

ముంబయి, అక్టోబరు 4: రిటైల్ దిగ్గజం డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. దిగ్గజ ఇన్వెస్టర్ రాధాకిషన్ దమానీకి చెందిన ఈ మల్టీబ్యాగర్ కంపెనీ, జులై సెప్టెంబర్ త్రైమాసికంలో తన విక్రయాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేయడంతో పాటు నెట్ వర్క్ విస్తరణలో భాగంగా కొత్త స్టోర్లను సైతం ప్రారంభిస్తోంది. జులై సెప్టెంబర్ త్రైమాసికంలో డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ ఏకీకృత రాబడి రూ.19,206.18 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.16,218.79 కోట్లుగాఉండగా ఇప్పుడు ఏకంగా 18.4 శాతం వృద్ధి కనబరిచింది. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే ఏప్రిల్ జూన్ 2026 త్రైమాసికంతో పోలిస్తే డీమార్ట్ ఆదాయం 4.7 శాతం పెరిగింది. రాధాకిషన్ దమానీ కుటుంబం నేతృత్వంలోని డిమార్ట్ అనేక రాష్ట్రాలలో నిత్యవసర గృహోపకరణాలు, వ్యక్తిగత వినియోగ ఉత్పత్తులను విక్రయిస్తోంది. క్యూ2 సమయంలో కంపెనీ దేశవ్యాప్తంగా కొత్త స్టోర్లను జోడించింది. దీంతో మొత్తం డిమార్ట్ అవుట్ లెట్ల సంఖ్య మరింత పెరిగింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.